
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY



నల్లగొండ
5
ఆదివారం 19 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.139	220	250
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 17.0



అర్హుల జాబితాపై అసంతృప్తి

- అందరినీ చేర్చలేదని అభ్యంతరాలు
- కులగణన ప్రాతిపదికన రేషన్‌కార్డుల జాబితా
- అర్హుల సంఖ్య కుదించారనే విమర్శలు
- గ్రామసభల్లో నిరసనలు ఎదురయ్యే అవకాశం
- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఎంపిక చేయాలనే సూచనలు
- మళ్లీ దరఖాస్తులు తీసుకోవాలని ప్రజల విన్నపం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రేషన్‌కార్డులు పొందేందుకు అర్హులైనవారి జాబితా దాదాపు 70శాతం మేర కుంచించుకుపోయిందని సమాచారం. పౌరసరఫరాలశాఖ రూపొందించిన జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 69,623 కుటుంబాలకు కొత్తగా రేషన్‌కార్డులు పొందేందుకు అర్హత ఉంది. పౌరసఫరాలశాఖ రూపొందించిన జాబితా ప్రకారం రేషన్‌కార్డు పొందాలంటే వార్షిక కుటుంబ ఆదాయం గ్రామాల్లో అయితే రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.2లక్షల లోపు ఆదాయం ఉండాలి. అదేవిధంగా వ్యవసాయభూమి తరి అయితే మూడున్నర ఎకరాలు, మెట్ట అయితే ఏడున్నర ఎకరాల భూమికి లోబడి ఉండాలి. ఈ ప్రాథమిక అర్హతల ఆధారంగా అర్హులను ఎంపికచేస్తే ఎలాంటి ఇబ్బందిలేకుండా న్యాయం జరిగేదని, కానీ కులగణన వివరాల ఆధారంగా తీసుకోవడం ద్వారా అన్యాయం జరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కులగణనలో మోటర్‌సైకిళ్లు, కారు, పక్కాఇళ్లు, ఉద్యోగ స్థితిగతులు, ప్రైవేట్ ఉద్యోగాల వివరాలు, వేతనాల వివరాలు సేకరించారు. ఈ వివరాలు ఇవ్వడంతో భార్యాభర్తలు కూలీ చేసుకునే కుటుంబాల వారు కూడా మోటర్‌సైకిల్ కలిగి ఉన్నారని, ఏడాదికి ఇద్దరికి కలిపి రూ.3లక్షల పైచిలుకు సంపాదన ఉంటుందని, పెరిగిన జీవన వ్యయం, మారిన జీవన సరళి నేపథ్యంలో ఈ సంపాదన, ఖర్చు బీపీఎల్‌కు లోబడే ఉంటుందని, అయితే రేషన్‌కార్డుకు విధించిన కనీస ఆదాయ పరిమితే సరిగా లేదని వాపోతున్నారు. ప్రస్తుతం కూలీ పనిచేసుకునే కుటుంబాల వారికి సైతం మోటర్ సైకిల్ తప్పనిసరి అవసరంగా మారింది. అదేవిధంగా పక్కాఇళ్లు కట్టుకుంటున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రతీ గ్రామంలో ఉన్నాయి. ఆ సందర్భంలో అందరూ ఇళ్లు కట్టుకోగా, ఇప్పుడు వీటన్నింటినీ ఆదాయంగా పరిగణించి రేషన్‌కార్డుల జాబితా నుంచి తొలగించి ఉంటారని అర్హులు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల్లో తెల్లకాగితాలపై దాదాపుగా 2,97,000 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ విచారణ చేసి అర్హులను గుర్తించి జాబితా రూపొందిస్తే ఈ గందరగోళం, విమర్శలకు అవకాశం ఉండదని పలువురు కాంగ్రెస్ నాయకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం చేపట్టిన ప్రక్రియ గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి సర్వే (కులగణన) ప్రాతిపదికన కొత్త రేషన్ కార్డులు జారీచేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జాబితా రూపొందించి కలెక్టర్లకు పంపింది. ఈ జాబితాలోని కుటుంబాల పరిస్థితిని మరోసారి పరిశీలించిన పిదప ఈనెల 21 నుంచి నిర్వహించే గ్రామసభల్లో గ్రామాలు, మున్సిపల్‌వార్డుల వారీగా తుదిజాబితా రూపొందించి కలెక్టర్ల ద్వారా మళ్లీ పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు నివేదిస్తారు. అయితే తాజాగా విడుదల చేసిన జాబితా సమగ్రంగా లేదని, తమకు చోటు దక్కలేదని పలువురు అర్హులు వాపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన దరఖాస్తులు తీసుకోగా, వాటిని పరిశీలించి లబ్ధిదారులను ఎంపిచేయాల్సి ఉండగా, దాన్ని విస్మరించి కులగణన సర్వేను ప్రామాణికంగా తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. అర్హులైన వారిలో సగం మంది పేర్లు కూడా జాబితాలో లేకపోవడంపై అధికారపార్టీకి చెందిన నాయకులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- (నల్లగొండ, ఆంధ్రజ్యోతిప్రతినిధి)



ప్రజాపాలన దరఖాస్తుల ప్రాతిపదిక తీసుకోవాలి

రేషన్‌కార్డుల అర్హుల జాబితా రూపకల్పన హడావిడిగా జరిగిందని, అర్హులకు అన్యాయం జరిగిందనే విమర్శలు, సమాచారం నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించాలనే సూచనలు వస్తున్నాయి. గ్రామసభల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాతో కలిపి రేషన్‌కార్డుల లబ్ధిదారులను కూడా ఎంపికచేయడం సమంజసం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేషన్‌కార్డులను బియ్యం కోసమే కాకుండా ఒక గుర్తింపుకార్డుగా, ఆరోగ్యపరమైన సమస్యలొచ్చినప్పుడు ఆసుపత్రుల్లో రిఫరెన్స్‌గా, ఒక రకంగా ఆధార్‌కు సమాంతరంగా దీన్ని ఉపయోగిస్తున్న నేపథ్యంలో ఈ కార్డులకు అర్హులను ఎంపికచేసేందుకు ప్రత్యేకంగా కార్యక్రమం చేపట్టాలని కోరుతున్నారు. ప్రజాపాలనలో తెల్లకాగితాలపై స్వీకరించిన దరఖాస్తుల నుంచి విచారణ జరిపి, అర్హులను గుర్తించి రేషన్‌కార్డులు జారీచేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండేది...

- మిగతా 6వ పేజీలో...

జిల్లా	రేషన్‌కార్డులకు అర్హులు	ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు	ప్రస్తుత రేషన్‌కార్డులు
నల్లగొండ	27,573	1,13,000	4,65,996
సూర్యాపేట	25,376	1,06,000	3,24,163
యాదాద్రి	16,674	78,000	2,16,831
మొత్తం	69,623	2,97,000	10,06,990

21న నల్లగొండలో రైతు మహాధర్నా

హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఉమ్మడి జిల్లా నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

మూడు జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షుల పిలుపు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు రవీంద్రకుమార్, బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 21వ తేదీన నల్లగొండలోని గడియారం సెంటర్‌లో రైతు మహాధర్నాను నిర్వహిస్తున్నట్టు నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, గాదరి కిషోర్, నోముల భగత్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాధర్నాకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి రానున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ పేరుతో మోసం చేసిందని, రైతుభరోసా రూ.15వేలకు హామీ ఇచ్చి రూ.12వేలకు తగ్గించిందన్నారు. వ్యవసాయరంగంతో పాటు గృహాలకు విద్యుత్ కోతలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. త్రీఫేస్ విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడో పోతుందో తెలియడం లేదని, యాసంగికి యూరియా కొరత మొదలైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులను రాజును చేయాలని చూస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందన్నారు. బీఆర్ఎస్‌కు అధికారం ముఖ్యం కాదని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము ముందుకు పోతామన్నారు. రేవంత్ సర్కారు రైతులను మోసం చేసిందని 420 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై దాడులు చేసేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, నిరంజన్ వలీ, కటికం సత్తయ్యగౌడ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, తండు సైదులు గౌడ్, కొండూరు సత్యనారాయణ, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, జమాల్ ఖాద్రీ, మైనం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అయిటిపాముల ఎత్తిపోతలను పూర్తి చేస్తాం

8వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



అయిటిపాముల ఎత్తిపోతల వద్ద మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని ఎనిమిది నెలల్లో పూర్తి చేసి 8వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని అధికారులు, స్థానిక రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహకారంతో అయిటిపాముల ఎత్తిపోతల పథకం మంజూరైందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో నిమ్మతోటలను బతికించేందుకు రైతులు ట్రాక్టర్లతో నీటిని తెచ్చేవారని, ఇకపై ఆ కష్టాలు ఉండవన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి కాగానే నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎత్తిపోతలను ప్రారంభింపజేయిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది సుక్కయ్య, మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, నంద్యాల వెంకట్‌రెడ్డి, వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాల వెంకన్న, సోమగాని రామకృష్ణ, బండారు కృష్ణ, ఎడ్ల పెద్ద రాములు, బూరుగు శ్రీను, దార భిక్షం, రెడ్డిపల్లి స్వామి, అనంతుల సైదులు, మిట్టపల్లి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కొనసాగిన రద్దీ

తిరుగుప్రయాణమైన ఏపీ వాసులు



పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

కేతేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ 65వ నెంబ రు జాతీయ రహదారిపై శనివారం తిరుగు ప్రయాణ వాహనాల రద్దీ కొనసాగింది. సంక్రాంతి పండగకు ఏపీతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు పూర్తిస్థాయిలో హైదరాబాద్‌కు చేరలేదు. పండుగ తరువాత బుధ, గురువారాల్లో కొందరు హైదరాబాద్ చేరగా, మిగిలిన వారు వీకెండ్ వరకు సొంతూళ్లలోనే గడిపారు. ఈ క్రమంలో పలువురు శనివారం హైదరాబాద్ బాటపట్టారు. దీంతో శనివారం ఉదయం నుంచి రద్దీగా ఉన్న 65వ నెంబరు జాతీయ రహదారిపై సాయంత్రానికి వాహనాల జోరు మరింత పెరిగింది. హైవేపై ఇదే రద్దీ ఆదివారం వరకు కొనసాగే అవకాశం ఉంది.

కొనసాగుతున్న ముస్లింల ఆధ్యాత్మిక సదస్సు



జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులో ఆధ్మాత్మిక సదస్సు అనంతరం బసచేసిన ముస్లింలు

నల్లగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డు ఈద్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ముస్లింల ఆధ్యాత్మిక సదస్సు శనివారం కొనసాగింది. పలువురు మత గురువులు, ఉల్మాలు, మౌలానాలు ఈ సదస్సుల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది సైతం నల్లగొండలో సదస్సు నిర్వహిస్తున్నామని, గత 50 ఏళ్లుగా ఈ సదస్సు కొనసాగుతోందన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ముస్లింలు సోదర భావంతో ఉండి దేవుడి బోధనలను అచరించాలన్నారు. మహమ్మద్ ప్రవక్త చెప్పిన బోధనలు, ఖురాన్‌లోని అంశాలను ప్రతీ ముస్లిం తప్పక పాటించాలని సూచించారు. దైవ భక్తి ఉన్నప్పుడే జీవితాలు సుఖమయంగా ఉంటాయని, ప్రవక్త బోధనలను అనుసరించి ఇతరులతో ప్రేమగా మెలగాలని, కరుణ, దయ, శాంతి, పరోపకారం, నిస్వార్థసేవా వంటి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. తప్పని సరిగా రోజుకు ఐదు సార్లు నమాజ్ చేయాలని, దివ్య గ్రంథమైన ఖురాన్‌ను తప్పక చదవాలని సూచించారు. యువకులు సన్మార్గంలో నడవాలని ప్రవచించారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు సదస్సు కొనసాగింది. ఐదు సార్లు నమాజ్ అనంతరం మత గురువులు, ఉల్మాలు, మౌలానాలు దైవ ప్రసంగం చేశారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు పలు ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సు ఆవరణలో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో మత పెద్దలు మౌలానా ఫారూక్, ముఫ్తీ అహ్మద్, ఖాద్రీ సైఫుల్లా, మౌలానా హారూన్, భాయి సాలిక్, ముఫ్తీ అమ్జద్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఎంవీఐ లావణ్య
- హెల్మెట్ ధరించని వాహనదారులకు చాక్లెట్ ఇచ్చి అవగాహన



ట్రాఫిక్ పీఎస్ ఆధ్వర్యంలో గడియారం సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం,జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, అందుకోసం విధిగా వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) లావణ్య సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నల్లగొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ దూది రాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు క్లాక్ టవర్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాహనదారులు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అత్యధికంగా మద్యం తాగి వాహనాలు నడపడంతో జరిగిన ప్రమాదాల్లో ఎక్కువ మంది మృతి చెందుతున్నారని, అంతేగాక క్షతగాత్రులవుతున్నారని అన్నారు. ప్రతీ వాహనదారుడి కోసం వారి కుటుంబం ఎదురు చూస్తుందనే విషయాన్ని గుర్తుంచుకొని జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులకు ట్రాఫిక్ సీఐ దూది రాజు చాక్లెట్లు ఇచ్చి హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

సర్వేను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



తిప్పర్తిలో ఇటుకబట్టీల స్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిప్పర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వేలను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సర్వేను ఆయన తనిఖీ చేశారు. రైతు భరోసా కోసం నిర్వహిస్తున్న సర్వేలో ఎంత మేర వ్యవసాయేతర భూములు ఉన్నాయి? ఎంత మేర సాగులో ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పలు గ్రామాల్లో ఏళ్లుగా సాగు భూమిగా ఆన్‌లైన్‌లో చూపుతోందని, కానీ అక్కడ నివాసాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయని అధికారులు ఆయనకు వివరించారు. అలాంటి స్థలాలను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ డి.స్వప్న, ఏవో సన్నిరాజు, ఏఈవో సంతోషిని, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ

- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన ప్రజలు
- పలువురు నేతల హౌస్ అరెస్ట్

•6లో..



అంబుజా సిమెంట్స్ గనుల విస్తరణపై దామరచర్ల మండలంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

భూసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



భూసర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

శాలిగౌరారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం అమలుకు వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు సర్వేను త్వరితగతిన చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వల్లాల గ్రామంలో భూముల గుర్తింపు సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు, నిర్ధారణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్రమ లేఅవుట్‌లు, ఇళ్లులేదా ఇళ్ల స్థలాలు,రోడ్లు,పరిశ్రమలు, గోదాములు, మైనింగ్, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు వ్యవసాయ యోగ్యం కానివిగా చూపించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సౌమ్య శృతి, ఏఈవో శ్రవణ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకన్నపాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ



నల్లగొండ జిల్లా భూములపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన ప్రజలు

దామరచర్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని గణేష్‌పహాడ్ గ్రామ పరిధిలోని పెన్నా సిమెంట్(ప్రస్తుత అంబుజా సిమెంట్) పరిశ్రమ వద్ద శనివారం గనుల లీజ్ పొడిగింపుకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా ముగిసింది. 2002లో యజమాన్యం పెన్నా సిమెంట్ పరిశ్రమను నిర్మించింది. ఇటీవల ఈ పరిశ్రమను అదాని గ్రూప్ కొనుగోలు చేసి అంబుజా సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పేరు మార్చింది. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యంపహాడ్ గ్రామ శివారులోని గనుల విస్తరణతో పాటు గణేష్ పహాడ్ గ్రామ శివారులోని గనుల లీజ్ పొడిగింపు కోసం విడివిడిగా ఒకదాని తరువాత మరొకటి ఒకేచోట ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులతో పాటు పలువురు పర్యావరణ కార్యకర్తలు పాల్గొని మాట్లాడారు. గణేష్‌పహాడ్, శూన్యంపహాడ్‌తోపాటు దామరచర్ల మండలంలో అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవడంతోపాటు పర్యావరణ సమతుల్యతను పాటించాలని కోరారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు ఉద్యోగుల బదిలీలకు తావు లేకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. అదేవిధంగా పరిశ్రమకు తమ మద్దతు తెలియచేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ విజయలక్ష్మీ, పరిశ్రమ జీఎం సుబ్బులక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తేనే పరిశ్రమల మనుగడ - ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

దామరచర్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి యాజమాన్యాలు తమవంతుగా కృషి చేస్తేనే పరిశ్రమలకు మనుగడ ఉంటుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన అంబుజా సిమెంట్ పరిశ్రమ ఆవరణలో మైనింగ్ విస్తరణ, లీజు గడువు పెంపు కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పరిశ్రమ పరిధిలోని గ్రామాలతోపాటు దామరచర్ల మండలంలో ఉన్న పరిశ్రమలకు సీఎస్ఆర్ నిధులు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో వినియోగించకపోవడం శోచనీయమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులను ఇతర ప్రాంతాలకు తరలించడంతో తమకు పూర్తి అన్యాయం జరిగిందన్నారు. ఈ ప్రాంతాల పరిశ్రమల యాజమాన్యాలు పూర్తి స్థాయిలో సీఎస్ఆర్ నిధులను ఈ ప్రాంత అభివృద్ధికే కేటాయించాలని సూచించారు. అదేవిధంగా గణేష్‌పహాడ్ గ్రామం నుంచి వాడపల్లికి వెళ్లేందుకు మూసీ నదిపై చిన్నపాటి వంతెనను యాజమాన్యం సొంత నిధులతో నిర్మించాలని సూచించారు. గతంలో పెన్నా సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం వంతెనను నిర్మిస్తామని చెప్పి నిర్మించకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు దూరం ప్రయాణించి బ్యాంకులకు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా గత 24 సంవత్సరాలుగా పరిశ్రమలో పనిచేస్తూ పరిశ్రమ అభివృద్ధికి దోహదపడిన స్థానిక ఉద్యోగులను, ఇతర ప్రాంతాలకు బదిలీ చేసేందుకు కొత్త యాజమాన్యం సిద్ధమవుతుందని అలాంటి ప్రతిపాదనలను విరమించుకోని స్థానికులకు ఇదే పరిశ్రమలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గతంలో పరిశ్రమ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన ఈ ప్రాంత రైతులకు గతంలో పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని, ప్రస్తుత కొత్త యాజమాన్యం వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ తీసుకునే దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. పరిశ్రమ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు పెట్టి యువతకు వృత్తి విద్యా నైపుణ్యంలో శిక్షణ ఇచ్చేందుకు యాజమాన్యం కృషి చేయాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే తమ మద్దతు పరిశ్రమకు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

పెన్నా సిమెంట్స్‌పై భిన్నాభిప్రాయాలు

పాలకవీడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 1.5మిలిమన్ టన్నుల నుంచి 1.8 మిలియన్ టన్నులకు సున్నపురాయి గని నిల్వలను తవ్వకానికి పర్యావరణ అనుమతుల కోసం సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని శూన్యపహాడ్‌లో పెన్నా సిమెంట్స్ పరిశ్రమ ఆవరణలో అదనపు కలెక్టర్ రాంబాబు అధ్యక్షతన శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ పెన్నా సిమెంట్స్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపించారు. పర్యావరణ, సామాజిక, స్థానిక ప్రజలు మాట్లాడుతూ పెన్నా సిమెంట్ పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 70శాతం ఉద్యోగాల అవకాశాలు కల్పించాలని కోరారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు ప్రాక్టికల్‌గా నేర్పించి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలని కోరారు. సీఎస్ఆర్ ఫండ్‌ను పరిశ్రమ పరిధిలోని పంచాయతీల అభివృద్ధికి ప్రధాన్యం ఇవ్వాలన్నారు. పెన్నా సిమెంట్స్ విస్తరణకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కొందరు, మరి కొందరు విస్తరణను వ్యతిరేకించారు. శూన్యపహాడ్ గ్రామానికి చెందిన అశోక్‌నాయక్ మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పడి 25సంవత్సరాలయినా గ్రామంలో కనీసం ఐదు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని వాపోయాడు. ప్రతి సంవత్సరం కనీసం 10మంది శూన్యపహాడ్ యువతకు ఉద్యోగాలు ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణలో 22మంది వక్తలు మాట్లాడారు. 364 మంది దరఖాస్తు రూపంలో తమ అభిప్రాయాలు తెలి పారు. వక్తలు మాట్లాడుతూ పరిశ్రమ విస్తరణతో పాటు కాలుష్య నియంత్రణ, పచ్చదనం కోసం విరివిరిగా మొక్కలు నాటాలని, స్థానికులకే పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

కాలుష్య నియంత్రణలో రాజీ పడడేదిలేదు - సుబ్బు లక్షణ్, పెన్నా సిమెంట్స్ జీఎం

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పెట్టి అర్హతలను ఉన్నవారికి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పెన్నా సిమెంట్స్ జీఎం సుబ్బు లక్షణ్ అన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో వక్తలు నుంచి వచ్చిన విషయాలపై మాట్లాడారు. అర్హతలను బట్టి స్థానికులకే ఎక్కువ శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నూతన ప్రాజెక్ట్ నిర్మాణంలో వాడబోతున్న యంత్రాలు వరల్డ్ లెటెస్ట్ యంత్రాలు వాడుతున్నామని వాటితో కాలుష్యాన్ని నియంత్రించవచ్చని అన్నారు. కాలుష్య నియంత్రణలో రాజీ పడడేదిలేదని ఎంత ఖర్చుయినా వెనకాడబోమన్నారు. సీఎస్ఆర్ ఫండ్‌ను పూర్తిగా పరిసర గ్రామాల్లోనే వినియోగిస్తామన్నారు. విద్య, వైద్యం కోసం కృషి చేస్తామన్నారు. పరిశ్రమ పరిధిలోని పేద ప్రజల, కార్మికుల పిల్లల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి సంగీత, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, డీఎస్పీలు శ్రీధర్‌రెడ్డి, సైదా నాయక్, తహసీల్దార్ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పాలకవీడు మండల వాసులు

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హౌస్ అరెస్ట్



హౌస్ అరెస్ట్‌తో నార్కట్‌పల్లిలో తన నివాసంలో చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు శనివారం హౌస్ అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో అంబూజా సిమెంట్‌పరిశ్రమ ఏర్పాటుపై అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉంది. దీంతో అక్కడకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి వెళ్లకుండా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ చిరుమర్తిని అతడి నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు.

హౌస్ అరెస్ట్ అప్రజాస్వామికం : చిరుమర్తి లింగయ్య

తనను హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా నిర్బంధించడం ప్రభుత్వ నియంత పోకడలను నిదర్శనమని ధ్వజమెత్తారు. అరెస్టులతో ప్రజాభిప్రాయ సేకరణకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే ప్రజల తరుపున తాము పోరాడుతామన్నారు.

నూనె వెంకటస్వామి నిర్బంధం

చిట్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామిని శనివారం స్థానిక పోలీసులు నిర్బంధించారు. జాన్‌పహడ్ వద్ద నిర్మిస్తున్న సిమెంటు పరిశ్రమ ప్రజాభిప్రాయ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు తెల్లవారుజామున వెంకటస్వామిని ఇంటి వద్ద అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్ట్

దామరచర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణేష్‌పాడు గ్రామంలో గల పెన్నా సిమెంట్ పరిశ్రమను అదాని గ్రూప్ కొనుగోలు చేయగా పర్యావరణ అనుమతులకై శనివారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణకు తాము వెళ్లకుండా పోలీసులు సీపీఎం నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ మాట్లాడుతూ గతంలో పెన్నా సిమెంట్ పరిశ్రమ ఈ ప్రాంత ప్రజలకు అనేక వాగ్ధానాలు ఇచ్చి మోసం చేసిందని అన్నారు. ఇప్పుడు తిరిగి పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యం పెంపు కోసం పర్యావరణ అనుమతులకై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ప్రజలకు అనేక మాయమాటలు చెప్తున్నారని, ప్రజలు వాటిని నమ్మి మోసపోకుండా పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనాలన్నారు. పరిశ్రమను మరొక ప్రాంతానికి మార్చేంతవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో దయానంద్, ఎర్రనాయక్ తదితరులు ఉన్నారు.

పలువురికి అవకాశం కల్పించని యాజమాన్యం

ప్రజాభిప్రాయ సేకరణలో తమవంతు సమస్యలను అధికారుల, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించలేదని పలువురు తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారంతోపాటు కాలుష్యంపై మైక్‌ల ముందు మాట్లాడుతారని భావించిన యాజమాన్యం తమకు అవకాశం కల్పించకుండానే కొద్ది మందితో ప్రజాభిప్రాయ సేకరణను తూతూ మంత్రంగా ముగించారని వారు తెలిపారు.

అర్హుల జాబితాపై అసంతృప్తి

(5వ పేజీ తరువాయి)

కాదని చెబుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి వస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే, 21 నుంచి జరిగే గ్రామసభల్లో ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎమ్మెల్యేలు, అధికారులకు సభల్లో నిరసనలు తప్పవని పలువురు పేర్కొంటున్నారు.

మళ్లీ దరఖాస్తులు తీసుకోవాలి

కొత్త రేషన్‌కార్డుల జారీ సందర్భంగా ప్రభుత్వం ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డులను తొలగించేది లేదని ప్రకటించడంపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 40ఏళ్ల క్రితం నుంచి రేషన్‌కార్డులు జారీ అయినప్పుడు నాడు బీపీఎల్ కుటుంబంగా ఉన్నవారు ఇప్పుడు స్థితిమంతులుగా మారారు. పలుచోట్ల రెండంతస్తుల భవనాలున్నవారికీ రేషన్‌కార్డులున్నాయి. గ్రామాల్లో 10 ఎకరాలకు పైబడినవారికి రేషన్‌కార్డులున్నాయి. టిన్ నెంబరే కాకుండా, ఐటీ రిటర్న్ దాఖలుచేసే వ్యాపారులకు, ఐటీ చెల్లించే వారికి కూడా రేషన్‌కార్డులున్నాయి. గ్రామాల్లో, పట్టణాల్లో అధిక ఆదాయ వర్గాలుగా పేరుబడిన వారికి సైతం ఉన్నాయి. వీటన్నిటినీ తొలగిస్తే ఉమ్మడి జిల్లాలో 30శాతం వరకు రేషన్‌కార్డులు రద్దవుతాయి. అప్పుడు నిజమైన అర్హులకు కార్డులు ఇవ్వవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మొత్తంగా పాత, కొత్త అనే భేదం లేకుండా అర్హులైన అందరి నుంచి దరఖాస్తులు తీసుకొని అందరికీ కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సూచనలు వస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఉపేందర్(ఫైల్)

మునగాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాలలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ శనివారం మృతి చెందారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తాడ్వాయి గ్రామానికి చెందిన గుట్టు ఉపేందర్(46) వీఆర్ఏగా పనిచేశాడు. ఈ క్రమంలో మునగాల గ్రామంలో సొంత ఇళ్లు తీసుకుని నివాసముంటున్నాడు. ఇటీవల ప్రమోషన్‌పై జూనియర్ అసిస్టెంట్ మఠంపల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మఠంపల్లి నుంచి ఇంటికి వస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు రద్దీ పెరగటంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌పై పడిపోయాడు. దీంతో ఉపేందర్‌కు తీవ్రగాయాలు కావటంతో కోదడ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అక్కడచికిత్స పొందుతూ మృతి చెందారు. ఉపేందర్‌కు బాబు, పాప ఉన్నారు. భార్య సృజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ..



రాముడు(ఫైల్)

మఠంపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. లాలితండాకు చెందిన బానోతు రాముడు(35) ఆటో నడుపుకొని జీవనం సాగిసున్నాడు. 2024 డిసెంబరు 4న బక్కమంతుగూడెం సమీపంలో ఆటోను లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తరలించారు. నెలరోజులుగా మృత్యుతో పోరాడిన రాముడు శనివారం మృతి చెందాడు. ఆటోపైనే ఆధారపడి జీవిస్తున్న వారి కుటుంబంలో విషాదఛాయలు అమలుకున్నాయి. రాముడుకి భార్య శ్రీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భూమి పోతుందని మనోవేదనతో రైతు మృతి



చిన్నలక్ష్మయ్య(ఫైల్)

వలిగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కళ్ల ఎదుటే సొంత భూమి ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో కోల్పోతుండటంతో తీవ్ర మనోవేదనకు గురై ఓ రైతు గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్థులు, బంధువుల తెలిపిన వివరాల ప్రకారం.. వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన నాగెల్లి చిన్న లక్ష్మయ్య (65) వృత్తి రీత్యా రైతు. అతడికి సుమారు ఐదు ఎకరాల భూమి ఉంది. లక్ష్మయ్యకు నర్సింహ, మల్లేశం అనే కుమారులు ఉన్నారు. ఐదెకరాల భూమిని లక్ష్మయ్య గతంలోనే ఇద్దరు కుమారులకు బదిలీ చేశాడు. అదే భూమిలో మూడు ఎకరాలు ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో కోల్పోతున్నాడు. తన కుటుంబానికి ఆ భూమే జీవనాధారం కాగా, జనవరి 10 గ్రామానికి అధికారులు సర్వేకోసం వచ్చినట్లు సమాచారం తెలుసుకున్నాడు. ఇంత కాలం భూమిని నమ్ముకొని జీవనం సాగిస్తుండగా, కళ్ల ఎదుటే ఆర్ఆర్ఆర్‌లో నష్టపోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ గురించే తరచూ మాట్లాడేవాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, లక్ష్మయ్య భార్య యాదమ్మ గతంలోనే మృతి చెందింది. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తండ్రి మందలించాడని బలవన్మరణం

ఆలేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పనిచేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడని తండ్రి మందలించడంతో కుమారుడు బలవన్మరణం చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ రజనికర్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరులోని బీసీకాలనీకి చెందిన పర్వతం సాయికుమార్(20) బిజినెస్ చేసేవాడు. కొన్నిరోజులుగా పనిమానేసి ఉంటున్నాడు. ఇంట్లో ఉంటే ఎలా అని తండ్రి అంజయ్య మందలించాడు. దాంతో మనస్థాపానికి గురైన సాయికుమార్ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబసభ్యులు అతడి కోసం వెతికారు. పట్టణంలో ఎస్వీ డిగ్రీ కళాశాల సమీపంలోని అక్షర వెంచర్‌లోని చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రజినికర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. అంజయ్య ఫిర్యాదుమేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాన్‌పహాడ్‌దర్గా ఉర్సుకు ఏర్పాట్లు



జాన్‌పహాడ్‌లోని దర్గా(ఫైల్)

పాలకవీడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కుల, మత సామరస్యానికి ప్రతీక ఈ దర్గా. ఇక్కడి ఉర్సుకు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ దర్గాను దర్శించుకునే వారిలో 80శాతం మంది హిందువులే కావడం గమనార్హం. మొదట్లో జాన్‌పహాక్ షహీద్ పిలవబడి కాలక్రమేణా జాన్‌పాక్ సైదాగా, జాన్‌పహాడ్ సైదులుగా స్థిరపడింది.

ఉర్సు ఉత్సవం

దర్గా వద్ద ప్రతీ ఏడాది సంక్రాంతి పండుగ వెళ్లిన తరువాత చందమామ వచ్చే శుక్రవారం ఉర్సు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఉర్సు సందర్భంగా హైదరాబాద్ నుంచి గంధాన్ని దర్గాకు తీసుకువచ్చి ఊరేగింపుగా దర్గాలో వుంచి భక్తులకు అందజేస్తారు. ఉర్సు ఉత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలి వస్తారు.

ఈ నెల 23 నుంచి 25 వరకు..

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతుంది. 25వ తేదీ వరకు కొనసాగే ఉత్సవంలో మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మొదటి రోజు దీపారాధనతో ఉర్సు ప్రారంభమవుతుంది. మరుసటి రోజు గంధాన్ని దట్టీలపై ఎక్కిస్తారు. ఇదే రోజు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. చివరి రోజైన దీపారాధనతో ఉర్సు ముగుస్తుంది.

నేడు మంత్రి ఉత్తమ్ సమీక్ష

నేడు పాలకవీడు మండలంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఏర్పాట్లు, జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకం పనులపై సమీక్షతో పాటు చెర్వుతండాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మృతదేహం లభ్యం

భువనగిరిరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కుళ్లిపోయిన ఓ వ్యక్తి మృతదేహం శనివారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ శివారులోని రాయిగిరి రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి కింద లభ్యమైనట్లు భువనగిరి రూరల్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాయిగిరి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద సుమారు 45 నుంచి 50 సంవత్సరాల గుర్తుతెలియని మృతదేహం నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు సమాచారం ఇచ్చారు. భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించి కుళ్లిన మృతదేహాన్ని జిల్లా కేంద్రఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. ఈ వ్యక్తి దాదాపు ఐదు రోజుల కిందట మృతి చెంది ఉంటాడని, తప్పిపోయిన వ్యక్తుల గురించి ఎవరికైనా ఏదైనా సమాచారం ఉంటే భువనగిరి రూరల్ పోలీసులను సంప్రదించాలన్నారు.

శోకసంద్రమైన కొండగడప

● మహారాష్ట్ర రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

మోత్కూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం కొండగడప వాసులు నలుగురికి శనివారం గ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఊరంతా కన్నీటి పర్యంతమవుతూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్యామ్‌శెట్టి ప్రేమలత, తొలుపునూరి ప్రసన్నలక్ష్మీ, తొలుపునూరి అక్షిత, శ్యామ్‌శెట్టి వైద్విక్(ఆరు నెలలు) మృతదేహాలు శుక్రవారమే స్వగ్రామానికి వచ్చాయి. మిగతా కుటుంబసభ్యులు క్షతగాత్రులై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండటంతో వారు వచ్చే వరకూ అంత్యక్రియలను నిలిపివేశారు. గాయపడి ఔరంగాబాద్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ప్రేమలత భర్త కృష్ణమూర్తిని డాక్టర్ల అనుమతితో ప్రత్యేక జాగ్రత్తలతో శనివారం కొండగడప గ్రామానికి తీసుకవచ్చారు. కుటుంబ సభ్యులను విగతజీవులుగా చూసి కృష్ణమూర్తి కన్నీరుమున్నీరయ్యాడు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న శ్యామ్‌శెట్టి వెంకన్న, తొలుపునూరి శ్రీనివాస్, శరణ్య తమ వారిని కడసారి చూసుకోలేకపోయారు.





అంత్యక్రియల్లో పాల్గొన్న కృష్ణమూర్తి, పెద్దసంఖ్యలో హాజరైన గ్రామస్థులు



తల్లికి ముందు నడిచిన కుమార్తె స్రవంతి

తల్లికి కుమార్తె, కోడలకి మామ తలకొరివి

అంత్యక్రియల పరిస్థితుల అందరి హృదయాలను ద్రవించేలా చేశాయి. కృష్ణమూర్తి కుమారుడు వెంకన్న ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో అతడి భార్య ప్రేమలతకు వారి చిన్నకుమార్తె స్రవంతి, తొలుపునూరి శ్రీనివాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో అతడి భార్య ప్రసన్నలక్ష్మీకి మామ(శ్రీనివాస్ తండ్రి) సత్యనారాయణ తలకొరివి పెట్టారు. అక్షిత వివాహం జరుగనందున ఆమెకు, చిన్నారి బాలునికి తలకొరివి పెట్టకుండా అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబానికి చెందిన ఒకేసారి నలుగురు మృతి చెందడం, వారికి అయిన వారు కడసారి చూపుకు రాలేని స్థితిలో ఉండటం ప్రజల హృదయాలను కలిచివేసింది. బంధువులు, స్నేహితులు వారికి కన్నీటి వీడ్కోలు పలికారు.

● మృతదేహాలను చూసి ఆగిన వృద్ధుడి గుండె



పెద్దరాములు(ఫైల్)

మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్యామ్ శెట్టి ప్రేమలత, ఆమె కూతురు ప్రసన్నలక్ష్మీ, మనుమరాలు అక్షిత, మనుమడు వైద్విక్ మృతదేహాలను శుక్రవారం వారి స్వగ్రామం కొండగడప తీసుకవచ్చిన విషయం తెలిసిందే. గ్రామస్థులు పెద్దసంఖ్యలో వెళ్లి అక్కడ హృదయవిదారక పరిస్థితిని చూసి కంటతడిపెట్టారు. అందిరిలానే గ్రామంలోని బుడిగె జంగాల కాలనీకి చెందిన కళ్లెం పెద్దరాములు(85) కృష్ణమూర్తి ఇంటికి వద్దకు వెళ్లి వరుసగా ఉంచిన మృతదేహాలను చూశాడు. అయ్యో ఒకేసారి నలుగురు మృతి చెందారా, కృష్ణమూర్తి కుటుంబం చిన్నాభిన్నమైందే అని వాపోయాడు. ఇంటికి తిరిగి వెళుతూ కొద్దిదూరం వెళ్లగానే తనకు గుండెలో నొప్పి వస్తుందంటూ కుప్పకూలిపోయాడు. అతడి కుటుంబసభ్యులు డాక్టర్‌ను పిలిచి చూపించగా అప్పటికే మృతి చెందాడని చెప్పారు. పెద్దరాములుకు నలుగురు కుమారులు, ఎనిమిది మంది కుమార్తెలు ఉన్నారు. అందరి వివాహాలు జరిగి స్థిరపడ్డారు. రాములు అంత్యక్రియలు కూడా శనివారమే జరిగాయి. కొండగడప గ్రామంలో ఒకేరోజు ఐదుగురు వ్యక్తులకు అంత్యక్రియలు జరపడం గ్రామమంతా శోకసంద్రమైంది.

పాత బస్తీలో 'మెట్రో' కూల్చివేతలు షురూ!

» మరోసారి భూసామర్థ్య పరీక్షలకు చర్యలు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాత బస్తీ మెట్రో నిర్మాణానికి సంబంధించిన కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. ఆస్తుల సేకరణలో భాగంగా ఇటీవల చెక్కులు అందజేసిన నిర్వాసితుల ఇళ్లను తొలగిస్తున్నారు. కారిడార్‌లోని దారుల్‌షిఫా నుంచి మీరాలంమండి వరకు నిర్మాణాలను తొలగిస్తూ శిథిలాలను తరలిస్తున్నారు. మొత్తం 1100 మందిలో ఇప్పటివరకు 260 మంది అనుమతి పత్రాలు అందజేశామని, ఇందులో 50 మందికి ఇటీవల చెక్కులు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి 20లోపు 1100 మందికి చెక్కులు అందజేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నిర్వాసితులందరికీ చెక్కులు పంపిణీ చేస్తే మార్చి 1 నుంచి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు హెచ్ఏఎంఎల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న కారిడార్ నిర్మాణంలో భాగంగా హెచ్ఏఎంఎల్ అధికారులు మరోసారి భూసామర్థ్య పరీక్షలు చేపట్టారు.

మెరుగైన సేవలందించే దిశగా పోలీసులు

» శాఖ ప్రతిష్ఠను పెంచేలా కార్యక్రమం: డీజీపీ జితేందర్

హైదరాబాద్, జనవరి18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసులు మరింత మెరుగైన సేవలందించేలా తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ వినూత్న శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం డీజీపీ కార్యాలయంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పోలీసు విభాగాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడం, శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా ప్రవర్తన ఉండటం, మహిళల భద్రత, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం తదితర అంశాలపై పోలీసు సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రతి జిల్లా నుంచి కొంతమంది పోలీసులను ఎంపిక చేసి నూతన లక్ష్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

ధన్ఘర్ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలి

» బీసీ కులాల పేర్ల మార్పుపై ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): పశుపోషణ, గొర్రెలు, మేకల పెంపకం కులవృత్తిగా ఉన్న ధన్ఘర్ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌కు ఆ కులం ప్రతినిధుల బృందం వినతి పత్రం సమర్పించింది. ఇటు 'బూంజువ' కులం విషయంలో జిల్లాల పరిమితులను ఎత్తివేయాలని ఆ కులం ప్రతినిధులు కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే బూంజువ కులాలకు కులం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని.. ఇతర జిల్లాల్లో ఇచ్చేలా చూడాలని బీసీ కమిషన్‌కు విన్నవించారు. జనవరి 3న బీసీ వర్గాల్లోని 8 కులాలకు పేర్లు మార్పులు, పర్యాయపదాలు జోడించాలనే అభ్యర్థనపై జారీ చేసిన నోటిఫికేషన్ గడువు ముగింపు సందర్భంగా అభ్యంతరాలు, ఫిర్యాదులను బీసీ కమిషన్ స్వీకరించింది.

ప్రజోపయోగ ప్రాజెక్టులకు సత్వర అనుమతులు

» కేంద్ర అటవీ శాఖ డైరెక్టర్ జనరల్ జితేంద్ర కుమార్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజోపయోగ ప్రాజెక్టులకు సత్వరమే అనుమతులు మంజూరు చేస్తామని కేంద్ర అటవీ శాఖ డైరెక్టర్ జనరల్ జితేంద్ర కుమార్ తెలిపారు. తెలంగాణలో ఉన్న అటవీ అనుమతుల పెండింగ్ విషయంపై జితేంద్ర కుమార్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్ అధ్యక్షతన అత్యున్నత సమావేశం అరణ్య భవన్‌లో శనివారం జరిగింది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి రాష్ట్రంలో అటవీ శాఖలో పెండింగులో ఉన్న వివిధ ప్రాజెక్టులపై చర్చించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి అందుకు అనుగుణంగా జితేంద్ర కుమార్‌ను రాష్ట్ర అధికారులతో చర్చించేందుకు హైదరాబాద్ పంపించారు. పెండింగ్ ప్రాజెక్టులు, కారణాలు, ఇతర అంశాలపై జితేంద్ర కుమార్.. అటవీ, రోడ్లు భవనాలు, జాతీయ రహదారుల విభాగం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 161 ప్రాజెక్టులు అనుమతుల కోసం పెండింగులో ఉన్నాయని ఈ సందర్భంగా డోబ్రియల్ ఆయనకు వివరించారు. అంతకుముందు దక్షిణాది రాష్ట్రాల అటవీ అధికారులతో సమావేశమైన జితేంద్ర కుమార్.. 'ఏక్ పేడ్ మా కే నామ్' (తల్లి పేరుతో మొక్క నాటడం), నగర వన్ యోజన పథకాలపై ఆయన చర్చించారు.

ముదిరాజ్ కార్పొరేషన్‌కు 2 వేల కోట్లు ఇవ్వాలి

» జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజులలోనే అత్యధిక పేదరికం తాండవిస్తోందని, ముదిరాజుల అభ్యున్నతి కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్‌కు రూ2 వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణలోని ముదిరాజ్‌ల చైతన్యమే లక్ష్యంగా 'ముదిరాజు ప్రజా చైతన్య బస్సు యాత్ర'ను శనివారం హైదరాబాద్ గన్‌పార్క్ నుంచి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి విడత కింద 5 జిల్లాల్లో పర్యటన ఉంటుందని, ఆ తరువాత రెండో విడతలో మిగిలిన జిల్లాల్లో యాత్ర చేస్తానని కుమారస్వామి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బ్యాంకుల్లో భద్రతా ఏర్పాట్లు పెరగాలి..

» సీసీ కెమెరాలతోపాటు నిపుణులైన సెక్యూరిటీని నియమించుకోవాలి: రాచకొండ సీపీ సుధీర్‌బాబు



హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు తమ భద్రత ఏర్పాట్లను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు సూచించారు. దేశంలో ఏటీఎం, బ్యాంకు దోపిడీ ఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో నేర నివారణ చర్యల్లో భాగంగా కమిషనరేట్‌లో శనివారం బ్యాంకుల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బ్యాంకుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, నిపుణులైన సెక్యూరిటీ సిబ్బంది నియామకంతోపాటు సైబర్ నేరాలను అడ్డుకునేందుకు ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇటీవల రాయపర్తి, బీదర్, మంగళూరులో బ్యాంకు, ఏటీఎం దోపిడీ ఘటనలను పరిశీలిస్తే బ్యాంకుల్లో భద్రతా లోపాలు బయటపడ్డాయని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న 489 బ్యాంకుల్లో ఉన్న భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు పరిశీలించారన్నారు. పలు లోపాలను గుర్తించి ఆయా బ్యాంకు శాఖల వద్ద ఏర్పాట్ల గురించి సీపీ సదరు బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రాజెక్టులకు అత్యవసర ప్రణాళిక రూపొందించాలి: ఈఎన్‌సీ అనిల్‌కుమార్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రాజెక్టుకు జాతీయ ఆనకట్టల భద్రత చట్టం(ఎన్‌డీఎస్‌ఏ), కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యవసర చర్యల ప్రణాళికను రూపొందించాలని డ్యామ్ భద్రత రాష్ట్ర కమిటీ చైర్మన్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నిర్ణీత వ్యవధిలోగా ఈ ప్రణాళిక ను సిద్ధం చేయాలన్నారు. ప్రాజెక్టుల వరద గేట్లతోపాటు రెగ్యులేటరీ గేట్లను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. నిబంధనల ప్రకారం అన్ని మరమ్మతులు చేపట్టాలని నిర్దేశించారు. అన్ని కట్టల వద్ద వరద సజావుగా వెళ్లడానికి వీలుగా ఆక్రమణలు ఉంటే తొలగించాలని నిర్దేశించారు. ఇందుకు జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ శాఖ సహకారం తీసుకోవాలన్నారు. 10 వేల ఎకరాలకు పైగా నీటిని అందించే కాలువలను తొలి విడతలో మరమ్మతు చేయాలన్నారు. వానాకాలంలోపు పనులు పూర్తికావాలన్నారు. కాలువల గట్లపై వన మహోత్సవంలో మొక్కలు నాటాలని సూచించారు.

మహా.. హైదరాబాద్!

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి కోసం 50 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా)ని 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటు చేశారు. అనంతరం నగర విస్తరణకు అనుగుణంగా 2008లో హుడాను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)గా మార్పు చేస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో హెచ్ఎండీఏ పరిధి 7,257 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. అందులో హైదరాబాద్ జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లాలైన రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జిల్లాల పునర్విభజనతో హెచ్ఎండీఏ పరిధి పెరగకపోయినా.. ఐదు జిల్లాలు ఏడు జిల్లాలుగా మారాయి. వీటిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలున్నాయి. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న షాద్‌నగర్.. రంగారెడ్డి జిల్లాలోకి రావడంతో మహబూబ్‌నగర్ జిల్లా హెచ్ఎండీఏలో లేకుండా పోయింది. దీంతో ప్రస్తుత హెచ్ఎండీఏ పరిధి.. ఏడు జిల్లాలు, 74 మండలాలు, సుమారు వెయ్యి గ్రామపంచాయతీలు, ఎనిమిది కార్పొరేషన్లు, 38కి పైగా మునిసిపాలిటీలతో కూడి ఉంది.


ప్రత్యేకం ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

ఆర్ఆర్ఆర్ అవతల ఐదు కిలోమీటర్ల వరకు..

హెచ్ఎండీఏ పరిధిలో మెరుగైన అభివృద్ధి కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2013లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్-2031ని తీసుకొచ్చారు. ఆ సందర్భంలోనే రీజినల్ రింగ్ రోడ్డును ప్రతిపాదిస్తూ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. అప్పటి అంచనాలకు అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను హద్దుగా చేసుకొని హైదరాబాద్‌ను విస్తరించడంతోపాటు హెచ్ఎండీఏ పరిధిలో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్డును కొన్ని ప్రాంతాల్లో ఆ పరిధిని దాటేస్తూ నిర్ణయించారు. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అలైన్‌మెంట్ కూడా ఖరారయింది. త్వరలోనే దక్షిణ భాగానికీ ఖరారు చేసే అవకాశాలున్నాయి. దీంతో హెచ్ఎండీఏ పరిధిని సైతం ఆర్ఆర్ఆర్‌పాటు అవతల 5కిలోమీటర్ల వరకు పెంచాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఆర్ఆర్ఆర్‌కు ఇరువైపులా అభివృద్ధి వేగంగా జరిగే అవకాశాలుండడంతో.. ఆ రోడ్డుకు అవతల కూడా పరిధిని పెంచుతున్నారు. దీంతో ఈ పరిధి 12-13 వేల చదరపు కిలోమీటర్లకు పెరిగే అవకాశాలున్నాయి. దీని పరిధిలోని ఏడు జిల్లాలు 11కు పెరగనున్నాయి. కొత్తగా నాలుగు జిల్లాలు నల్లగొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ చేరనున్నాయి. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు ఇప్పటికే పూర్తిగా ఉండగా.. తాజాగా రంగారెడ్డి జిల్లా పూర్తిగా రానుంది. ఇక యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాలో అత్యధిక మండలాలు రానున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో ప్రస్తుతమున్న 74 మండలాలకు అదనంగా మరో 32 మండలాలు చేరి 106 మండలాలు కానున్నాయి. జీహెచ్ఎంసీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు ఏడు మునిసిపల్ కార్పొరేషన్లు, 34 మునిసిపాలిటీలతో కలిపి మొత్తం 43 అర్బన్ స్థానిక సంస్థలు ఉండనున్నాయి.

కోర్ అర్బన్, సెమీ అర్బన్ ఏరియాలుగా

హెచ్ఎండీఏ పరిధిని విస్తరించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించిన ప్రభుత్వం.. జీహెచ్ఎంసీ పరిధిని కూడా ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించనుంది. దాదాపు 2వేల చదరపు కిలోమీటర్ల వరకు జీహెచ్ఎంసీ పరిధి పెరగనుంది. ఈ పరిధిలో జీహెచ్ఎంసీతోపాటు 33 గ్రామపంచాయతీలు, 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఉండగా వాటన్నింటినీ కోర్ అర్బన్ ఏరియాగా నిర్ధారించి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇక ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని సెమీ అర్బన్ ఏరియాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాంతంలో ఆర్ఆర్ఆర్‌కు ఆవల 5కిలోమీటర్ల వరకు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే బాధ్యతలను కూడా హెచ్ఎండీఏకు అప్పగించారు. ఈలోపు హెచ్ఎండీఏ పరిధిని విస్తరిస్తూ బోర్డు సమావేశం జరపడంతోపాటు క్యాబినెట్‌లో చర్చించి.. అవసరమైతే అసెంబ్లీలో బిల్లును కూడా పెట్టే అవకాశాలున్నాయి.



హెచ్ఎండీఏ విస్తరణను ప్రతిపాదిస్తూ రూపొందించిన మ్యాప్

- మ్యాప్‌లో బ్లూ లైన్‌తో సూచిస్తున్నది ప్రస్తుతం హెచ్ఎండీఏ విస్తరించి ఉన్న పరిధి
- రెడ్ లైన్‌లో సూచిస్తున్నది త్వరలో నిర్మాణం జరుపుకోనున్న రీజినల్ రింగ్ రోడ్డు
- రెడ్ లైన్ బయట ఉన్న ప్రదేశం హెచ్ఎండీఏ విస్తరించనున్న ప్రతిపాదిత పరిధి.

హెచ్ఎండీఏలో కొత్తగా చేరే మండలాలు..

- రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 22 మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో ఐదు మండలాలు తలకొండపల్లి, ఆమనగల్లు, మాడుగుల, కడ్తాల్, కేశంపేట చేరనున్నాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలోని మొత్తం 27 మండలాలు హెచ్ఎండీఏ పరిధిలోకే రానున్నాయి.
- సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 8మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో మూడు మండలాలు చౌటకూర్, కొండాపూర్, సదాశివపేట రానున్నాయి.
- సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే మూడు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో మూడు మండలాలు గజ్వేల్, జగదేవ్‌పూర్, రాయపోల్ చేరనున్నాయి.
- మెదక్ జిల్లాలో ఇప్పటికే ఐదు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మాసాయిపేట మండలం చేరనుంది.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటికే ఐదు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో ఐదు మండలాలు సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, రాజపేట, యాదగిరిగుట్ట, తుర్కపల్లి చేరనున్నాయి.

కొత్తగా చేరే జిల్లాల్లోని మండలాలు..

- వికారాబాద్ జిల్లా హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో ఐదు మండలాలు మాత్రమే రానున్నాయి. మోమిన్‌పేట, నవాబ్‌పేట, పరిగి, పూడూరు, వికారాబాద్ మండలాలు కొత్తగా హెచ్ఎండీఏ పరిధిలోకి రానుండగా.. అందులోనూ కొన్ని గ్రామాలే ఉంటాయి.
- నల్లగొండ జిల్లా హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం 6మండలాలు మాత్రమే రానున్నాయి. వీటిలోనూ గట్టుప్పల్ మండలం మినహా చండూరు, చింతపల్లి, మర్రిగూడ, మునుగోడు, నాంపల్లి మండలాల్లో కొన్ని గ్రామాలు రానున్నాయి.
- మహబూబ్‌నగర్ జిల్లా హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం మూడు మండలాలు నవాబ్‌పేట, బాలానగర్, రాజపూర్‌లలోని కొన్ని గ్రామాలు మాత్రమే రానున్నాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లా హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం వెల్దండ మండలంలోని మూడు గ్రామాలే రానున్నాయి.

ఢిల్లీలో రేవంత్‌ది అబద్ధాల ప్రచారం

» ముందు చిరుద్యోగులకు జీతాలివ్వండి: హరీశ్ రావు

» రేషన్ కార్డుల జారీలో నిబంధనలు సవరించాలని సీఎంకు లేఖ

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి అక్కడి ప్రజలను అబద్ధాలతో నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలు చేశామని చెబుతున్నారని, ముందుగా చిరుద్యోగులకు జీతాలు చెల్లించాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చశారు. కాంగ్రెస్ పాలనలో చిరుద్యోగుల పరిస్థితి దారుణంగా మారిందని, జీతాల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. 4 నెలలుగా పంచాయతీ కార్మికులు, 3 నెలలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. అలాగే మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెల రోజుల జీతం బకాయి పడ్డారని, ఇంట్లో అన్ని సమస్యలు పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పెట్టుబడుల కోసమంటూ పర్యటనలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీ వెళ్లి చక్కర్లు కొట్టడం మాని చిరుద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో లక్షలాది మంది లబ్ధిదారులు నష్టపోతున్నారని, నిబంధనలు సవరించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగలేఖ రాశారు.

ప్రభుత్వ విధానాల వల్లే రైతు ఆత్మహత్యలు

» హామీల అమలుకు కొట్లాడుదాం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'పంట ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణ ఈ రోజు రైతు ఆత్మహత్యల్లో ప్రథమ స్థానంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలే ఇందుకు కారణం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రైతు జాదవ్ నాగోరావ్ ఐసీఐసీఐ బ్యాంకు శాఖకు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం పట్ల శనివారం ఓ ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వం చేసిన హత్య అని ఆరోపించారు. రుణమాఫీ చేయకుండా తప్పించుకునేందుకు సర్కారు ప్రయత్నిస్తుండటమే రైతుల ఆత్మహత్యలకు కారణమన్నారు. అధికారంలోకి రాగానే 2 లక్షల రుణమాఫీ చేస్తానన్న సీఎం రేవంత్ మాట తప్పడంతోనే నాగోరావ్ బలయ్యారన్నారు. ఈ ప్రభుత్వంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని, రైతు కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దామని, హామీలు అమలయ్యేవరకు కొట్లాడుదామని, రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు.

బీఆర్ఎస్‌కు 41కోట్లు ఎందుకిచ్చారు?

(మొదటిపేజీ తరువాయి)

ఏసీబీ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. క్రీడల్లో ఏమాత్రం అనుభవం లేని మీ కంపెనీ ఇందులోకి ఎందుకు దిగింది? ఎవరు మిమ్మల్ని ఆహ్వానించారు? మీకే విధమైన హామీలిచ్చారు? ఒప్పందానికి ముందే బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.41 కోట్ల మొత్తం ఎందుకిచ్చారు? రేసు ద్వారా మీ కంపెనీకి లాభం వచ్చిందా? నష్టం వచ్చిందా? ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ రెండో సెషన్ పూర్తి చేయకుండానే ఎందుకు వైదొలిగారు? తదితర ప్రశ్నలు అడిగారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యానికి సంబంధించి కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఫార్ములా-ఈ కారు రేసులో ప్రమోటర్‌గా ఉండబోతున్న విషయం మీకు ఎప్పుడు తెలిసింది? మిమ్మల్ని ప్రమోటర్‌గా ఆహ్వానించింది కేటీఆరేనా? ప్రమోటర్‌గా అవకాశం లభించనున్న సంగతి తెలిసే.. రేసు ప్రారంభం అవడానికి ముందు ఏస్ నెక్ట్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలను ప్రారంభించారా? అప్పట్లో మీకు, రాష్ట్ర పురపాలకశాఖకు, అప్పటి మంత్రి కేటీఆర్‌కు మధ్య జరిగిన సంభాషణలేమిటి?' అంటూ అనిల్ కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

మళ్లీ విచారణకు పిలుస్తాం!

రేసు మొదటి సెషన్‌కు సంబంధించి 'ఫార్ములా ఈ ఆపరేషన్స్' (ఎఫ్ఈఓ) కంపెనీకి చెల్లించాల్సిన రూ.90 కోట్ల ఫీజును ఏస్ అర్బన్ డెవలపర్స్ నుంచి రుణం రూపంలో ఎందుకు తీసుకున్నారనే కోణంలోనూ ఏసీబీ విచారణ కొనసాగినట్లు సమాచారం. ఏస్ అర్బన్ డెవలపర్స్ కంపెనీ ఏస్ నెక్ట్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీల అనుబంధ సంస్థనే కావటం గమనార్హం. కాగా, విచారణకు సమయం తక్కువగా ఉండటంతో మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని, మళ్లీ నోటీసు ఇస్తామని ఏసీబీ అధికారులు అనిల్ కుమార్ బృందానికి తెలిపినట్లు సమాచారం. అధికారుల ప్రశ్నలకు అనిల్ కుమార్ సమాధానమిస్తూ.. అప్పట్లో ఏం జరిగిందనే సంగతిని వివరంగా వెల్లడించినట్లు తెలిసింది. ఎలక్టోరల్ బాండ్లను అన్ని రాజకీయపార్టీలకు ఇచ్చినట్లే బీఆర్ఎస్‌కు ఇచ్చామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తమ కంపెనీ చట్టపరంగా ఒప్పందం చేసుకుందని, నష్టం రావడంతో రెండో సెషన్ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని, నాటి అధికారులకు, మంత్రికి చెప్పిన తర్వాతే తప్పుకొన్నామని అనిల్ వెల్లడించారు.


ఆలస్యంగా మొదలైన విచారణ

వాస్తవానికి ఏస్ నెక్ట్స్‌జెన్ కంపెనీ ప్రతినిధులు ఉదయం పదిన్నరకు ఏసీబీ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉండగా, తమ విమానం ఆలస్యం అయ్యిందని, తమకు కొంత సమయం ఇవ్వాలని వారు ఏసీబీని కోరారు. దీంతో మధ్యాహ్నం తర్వాత విచారణకు రావచ్చని ఏసీబీ అధికారులు సూచించడంతో మధ్యాహ్నం రెండున్నరకు ఏస్ నెక్ట్స్‌జెన్ ఏండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌తో పాటు మరికొందరు ప్రతినిధులు ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. మూడున్నర గంటల పాటు విచారణ కొనసాగింది.


ఇవీ ఆరోపణలు..

హైదరాబాద్‌లో నాలుగు సెషన్లలో ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహించడం కోసం రాష్ట్ర పురపాలకశాఖ, ఎఫ్ఈఓ, ఏస్ నెక్ట్స్‌జెన్ మధ్య 2022 అక్టోబరు 25న త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రమోటర్‌గా ఉంటూ 9, 10, 11, 12 సెషన్లకు సంబంధించిన ఫీజును ఎఫ్ఈఓకు వాయిదాల రూపంలో చెల్లించాలి. బ్రిటన్‌కు చెందిన ఎఫ్ఈఓతో అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తొలిదఫా చర్చలు జరిపిన తర్వాత.. హఠాత్తుగా ఏస్ నెక్ట్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలను 2022 జూలైలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కంపెనీల రిజిస్ట్రేషన్‌కు 15 రోజుల ముందే ఏస్ నెక్ట్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీల మాతృసంస్థ గ్రీన్కో నుంచి రూ.10 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్‌కు అందాయి. దానికి రెండు నెలల ముందు కూడా గ్రీన్కో నుంచే బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.31 కోట్లు లభించాయి. 9వ సెషన్ పూర్తయిన తర్వాత పదో సెషన్ ప్రారంభానికి ముందే ఏస్ నెక్ట్స్‌జెన్ ఒప్పందం నుంచి వైదొలిగింది. కేటీఆర్ ఆదేశాల మేరకు పురపాలకశాఖ అధికారులు హెచ్ఎండీఏ నుంచి రూ.45.71 కోట్ల మొత్తాన్ని ఎఫ్ఈఓకు పౌండ్ల రూపంలో చెల్లించారు. వీటన్నింటిపైనా ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

కాలికి, చేతికి వైరు చుట్టి కరెంట్ షాక్ పెట్టి..



మృతుడు శంకర్




గోపాల్ (ఫైల్)

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఏడాది క్రితం తల్లిదండ్రులు లేని మరో యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుని తండాకు తీసుకొచ్చాడు. అయితే, శంకర్ భార్యతో గోపాల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తన భార్యతో గోపాల్ సన్నిహితంగా ఉండడాన్ని చూసిన శంకర్ గొడవ పడ్డాడు. తన భార్య జోలికి రావొద్దని తమ్ముడిని హెచ్చరించాడు. ఈ విషయంలో అన్నదమ్ముల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. అయినా, గోపాల్ మారకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. దీంతో శంకర్ మూడో భార్య ఇల్లు వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శంకర్‌పై గోపాల్ కక్ష పెంచుకున్నాడు. వదినతో బంధానికి అడ్డుగా ఉన్న అన్న అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఓ చోరీ కేసులో ఇటీవల జైలుకు వెళ్లి వచ్చిన గోపాల్ అవకాశం కోసం చూస్తున్నాడు. ఈ క్రమంలో శంకర్ మద్యం తాగి శుక్రవారం రాత్రి నిద్రపోయాడు. అతని వద్దే నిద్రించిన గోపాల్ అర్ధరాత్రి తర్వాత మేల్కొని.. శంకర్ కాలు, చేతికి విద్యుత్ వైర్లు చుట్టి ప్లగ్ బోర్డులో స్విచ్ ఆన్ చేశాడు. దీంతో శంకర్ విద్యుదాఘాతానికి గురై కేకలు వేశాడు. ఈ అలికిడికి నిద్ర లేచిన వారి తండ్రి చందర్.. తలుపులు తీయమని అరిచాడు. తలుపు తీసిన గోపాల్ తండ్రి చందర్‌ను నెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. చందర్ లోపలికి వెళ్లి చూసే సరికి శంకర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు చందర్ నుంచి ఫిర్యాదు అందుకున్న తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గోపాల్‌ను పోలీసులు శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు.

చిట్టీ వేసిన డబ్బులు తిరిగివ్వాలన్నందుకు మహిళ హత్య

» 6 నెలల క్రితం గొంతునులిమి చంపి పూడ్చివేత



విజయ(ఫైల్)

మోపాల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తనకు రావాల్సిన చిట్టీ డబ్బులు అడిగినందుకు ఓ మహిళను దారుణంగా హత్య చేశాడో వ్యాపారి. ఆరు నెలల తర్వాత విషయం బయటపడింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో జరిగింది. మోపాల్‌కు చెందిన విజయ(45) వ్యవసాయ కూలీ. ఆమె భర్త విజయ్. వీరికి ఇద్దరు కుమారులు. విజయ్ దుబాయ్‌లో ఉండగా పంపిన డబ్బుల విషయంలో గొడవలు వచ్చి భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. మరోవైపు, మోపాల్‌కే చెందిన బుచ్చన్న అనే వ్యాపారి దగ్గర విజయ కొన్నేళ్ల పాటు చిట్టీ వేసింది. ఏడాది క్రితం చిట్టీ గడువు పూర్తయ్యాక.. తనకు రావాల్సిన డబ్బులు ఇచ్చేయాలని బుచ్చన్నను అడిగింది. కానీ, బుచ్చన్న ఏడాది పాటు రేపిస్తా.. మాపిస్తా.. అంటూ తప్పించుకు తిరిగాడు. 6 నెలల క్రితం బుచ్చన్నపై విజయ గ్రామపెద్దల ముందు పంచాయతీ పెట్టించింది. దీంతో విజయపై కోపాన్ని పెంచుకున్న బుచ్చన్న.. చిట్టీ డబ్బులు ఇస్తానని జూలైలో ఆమెను ఇంటికి రమ్మన్నాడు. తన వద్ద పని చేసే నగేశ్ సహాయంతో విజయకు కల్లు తాగించి.. ఆ తర్వాత గొంతు నులిమి చంపేశాడు. గ్రామ శివారులో మృతదేహాన్ని పూడ్చి పెట్టాడు. విజయ కుమారుడు మనోహర్.. ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చండూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చండూరు మండలం నగర సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల పరిధిలోని చామలపల్లి గ్రామంలో శనివారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లెట్ల మార్యయ్య, జిల్లా అధ్యక్షుడు నేర్లకంటి రవికుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులకు, కులస్థులకు క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా నాయకులు బలుగూరి కరుణాకర్, కొలుగూరి ప్రవీణ్, నేర్లకంటి శంకరయ్య, చండూరు పట్టణ అధ్యక్షుడు గంట వెంకటేష్, నాయకులు కల్లెట్ల పెద్దమారయ్య, కొలుగూరి రమేష్, గొల్లూరి వెంకటేష్, ఆంజనేయులు, కల్లెట్ల బిక్షమయ్య, రాసాల ఆంజనేయులు, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

కట్టంగూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు తెలిపారు. సంబంధిత అధికారులు సకాలంలో హాజరై గ్రామసభలు నిర్వహించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- చండూరు మునిసిపల్ కమిషనర్ మున్వర్‌అలీ
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

చండూరు మునిసిపాలిటీ కార్యాలయంలో శనివారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని పలు కాలనీల ప్రజలు మునిసిపల్ కమిషనర్ మున్వర్‌అలీకి నేరుగా ఫోన్ చేసి మురుగు కాల్వలు, రోడ్డు విస్తరణ పనులు, కుక్కలు, పందుల బెడద, రేషన్‌కార్డులు తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

- (ఆంధ్రజ్యోతి, చండూరు)



ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ మున్వర్ అలీ

కుక్కల సమస్యల తీవ్రంగా ఉంది

- భూతరాజు శ్రీహరి, 10వ వార్డు

కమిషనర్: కుక్కల నియంత్రణకు వాటికి కుటుంబ నియంత్రణ చర్యలు ఇప్పటికే చేపట్టాం. వాటి జోలికి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలి. వాటికి హాని తలపెట్టినప్పుడే దాడి చేస్తాయి.

ఎంతమందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయి

- జాల శ్యాంప్రసాద్, 8వ వార్డు

కమిషనర్ : పట్టణంలో 10 వార్డుల్లో 203 మందికి రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. అర్హత కలిగిన వారి పేరు లిస్టులో లేకుంటే ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఆయా వార్డుల్లో నిర్వహించే గ్రామ సభలో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు.

డ్రైనేజీల్లో తీసిన మురుగుతో వీధులు చెత్తకుప్పలుగా మారుతున్నాయి

- తిరందాసు నందు, 7వ వార్డు

కమిషనర్: డ్రైనేజీలో తీసిన చెత్త తడిగా ఉండటంతో, ఎండిన తర్వాతనే తొలగించే అవకాశం ఉంది.

దోమలతో బెడద తీవ్రంగా ఉంది

- కొలుగూరి రమేష్, 1వ వార్డు

కమిషనర్: డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను సిబ్బందితో తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం.

పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగాయి

- పేర్ల గణేష్, 9వ వార్డు

కమిషనర్: నేనే స్వయంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి వారం క్రితమే పిచ్చి మొక్కలను తొలగించాం. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా లిస్టులో పేరు రాలేదు

- గండూరి సత్యనారాయణ, 8వ వార్డు

కమిషనర్: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని లిస్టులో పేరు లేకున్నా నిరాశ పడొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. ఇది నిరంతర ప్రక్రియ.

పట్టణంలో గ్యాస్ గోదాములు లేవు

- భూతరాజు శ్రీశైలం, 4వ వార్డు

కమిషనర్: సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

చెత్తను సేకరించే వాహనాలు రావడం లేదు, పందుల బెడద తీవ్రంగా ఉంది

- రుద్ర రాజు, 4వ వార్డు

కమిషనర్: చెత్తను సేకరించే వాహనాలు ప్రతీ వార్డుల్లో ప్రతీ రోజూ వస్తున్నాయి. చెత్త సేకరణలో వాహనాలను ఏర్పాటు చేస్తాం. పందుల పెంపకందారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఊరి బయట పెంచుకునేలా చర్యలు తీసుకుంటాం. అవగాహన కల్పిస్తాం.

నిరుద్యోగులు, యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

నల్లగొండటౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థ ద్వారా నిరుద్యోగులకు, యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ శిక్షణ సంస్థ ఇన్‌చార్జి ఎం.సరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్, ప్లంబర్, సెల్ మరమ్మతులలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సులను బట్టి మూడు నెలల నుంచి సంవత్సరం పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం సయమంలో వర్కింగ్ టీచర్లకు టీచర్ ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులు పూర్తిచేసిన తర్వాత స్వయం ఉపాధి పొందవచ్చని, తమ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు కూడా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ప్రతీక్ రెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పక్కన గల సెట్విన్ సెంటర్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 97050441789 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ***నల్లగొండ పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి***

నల్లగొండ, మునుగోడు, మర్రిగూడ, నార్కట్‌పల్లి, గట్టుప్పల్, చండూరు, చిట్యాలరూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని టీడీపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం హైదరాబాద్ రోడ్డులోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చి రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత ఎన్‌టీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల మధుసూదన్‌రెడ్డి, ఎల్వీయాదవ్, గుండు వెంకటేశ్వర్లు, కూరెళ్ల విజయ్‌కుమార్, ఆకునూరు సత్యనారాయణ, తేలన్న రవి, చంద్రశేఖర్, రఫీక్, ఇస్తారి, దయాకర్, శంకర్‌రెడ్డి, గంగాధర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్లమెంట్ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి



చిట్యాల మండలం ఉరుమడ్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

● మునుగోడులో టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆ మహనీయుడుతోనే దేశంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలు అమలులోకి వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు గొలను వేణుగోపాల్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యుడు శ్రీపతి రాంరెడ్డి, మొగుదాల పార్వతమ్మ, ఎండీ. షరీఫ్, పాషా, వీరమల్ల అశోక్, పందుల రాములు, బండారు రఘు, సత్తయ్య, పొడపంగి సైదులు, అంజిరెడ్డి, అంజయ్య, మారయ్య, యాదయ్య, లక్ష్మయ్య, నర్సింహ పాల్గొన్నారు.

● మర్రిగూడలో టీడీపీ మండల అధ్యక్షుడు, జిల్లా ప్రచార కార్యదర్శి దోమల వెంకటయ్య మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యద ర్శి యాదయ్య, అంజయ్య, సత్తయ్య, మల్లేష్, నిరంజన్ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించా రు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంట్ మాజీ కార్యదర్శి లింగాల యాద య్య, చెన్నారం సత్తయ్య, చింత లక్ష్మణ్, చింత రాజు, బొబ్బల మల్లేషం, శివ, రామలింగం, లింగాల నరేందర్ పాల్గొన్నారు.

● గట్టుప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గట్టుప్పల్ మాజీ సర్పంచ్ నామని జగన్నాథం, టీడీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీపతి రాం రెడ్డి, మండల అధ్యక్షుడు గడ్డం కృష్ణయ్య, మండల కార్యదర్శి ఎండీ పాషా నాయకులు బొల్లా శంకర్, పెట్టిగాలా అంజయ్య, కొండయ్య, శ్రీకాంత్, రాజు, నర్సింహ, రాము, తిమయ్య, యాదయ్య పాల్గొన్నారు.

● చండూరులో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మొగుదాల పార్వతమ్మ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కమిటీ సభ్యుడు ఎండీ షరీఫ్, నాయకులు అబ్బనబోయిన అంజయ్య, అంజయ్య, బోడ బిక్షమయ్య, నర్సింహ, అనిల్, కృష్ణయ్య, కనకయ్య పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేముల బిక్షం, కొత్త లింగస్వామి, తాటికొండ సత్తయ్య, ఉయ్యాల రాజు, సాగర్ల గంగరాజు, ఉయ్యాల లింగస్వామి, సుంకరి నర్సింహ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

- ***కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున***

నాంపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని, విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఈ మహాసభలు 25 నుంచి 28వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నందున కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, లక్ష్మయ్య, వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, యాదగిరి, సైదులు, గోపాల్, లక్ష్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వంట మనిషి కోసం దరఖాస్తుల ఆహ్వానం

శాలిగౌరారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల పరిధిలోని తిరుమలరాయినిగూడెంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో వంట మనిషి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి వంట చేసే అనుభవం కలిగిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఎస్‌వోకు అందజేయాలన్నారు.

దినచర్యను రాసుకోవడం అలవాటు చేసుకోవాలి

చిట్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దినచర్యను రాసుకోవడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎంఈవో సైదానాయక్ తెలిపారు. శనివారం చిట్యాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యాంశాలను ప్రణాళికాబద్ధంగాముందుగా రాసుకుని బోధిస్తే మరింత ఫలప్రదంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కంచరకుంట్ల సుధాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, లుకేందర్‌రెడ్డి, వెంకట నర్సింహాచారి, మాధవి పాల్గొన్నారు.

కొంపల్లి హైస్కూల్‌లో స్టంపు మోటార్ చోరీ

మునుగోడురూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని కొం పల్లి గ్రామ పంచాయతీలో జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో స్టంపు మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. శనివారం పాఠశాల రీఓపెన్ చేయడంతో ఉపాధ్యాయులు, స్థానికులు గమనించారు. గతంలో ప్రాథమిక పాఠశాలలో కూడా మోటార్ చోరీకి గురైంది.

ఉద్యమాల ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డిని గెలిపించాలి



ప్రచారకరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోపాల్‌రెడ్డి

నల్లగొండటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జీవితమంతా విలువల కోసం నిలబడిన నిజాయతీ కలిగిన ఉద్యమాల ఉపాధ్యాయుడు పన్నాల గోపాల్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అధ్యాపక ఉపాధ్యాయులను జేఏసీ జిల్లా నాయకుడు డాక్టర్ తోట నరసింహాచారి కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆయన ప్రచారకరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను ఎన్నుకోవాలన్నారు. టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ శాసనమండలిలో ఉపాధ్యాయ ఉద్యమనేత గోపాల్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలతో పాటు ప్రధానంగా స్పెషల్ టీచర్లకు నేషనల్ ఇంక్రిమెంట్లు వర్తింపజేయాలనే ప్రధాన డిమాండ్‌తో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు, దూదిపాల భాస్కర్‌రెడ్డి, జయ వెంకటనారాయణ, బి.గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయుడు, యాదయ్య, భాస్కర్‌రెడ్డి, పాండరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యావర్

కేతేపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని నకిరేకల్ సివిల్ జడ్జి, న్యాయ సేవా కమిటీ చైర్మన్ మంజుల సూర్యావర్ సూచించారు. కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో పేదరికం లేకుండా చేసేందుకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. నిరక్షరాస్యత, సరైన అవగాహన లేకపోవడం వల్ల నేటికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు చేరడం లేదన్నారు. కార్యక్రమంలో కేతేపల్లి ఎస్‌ఐ ఎ.శివతేజ, నకిరేకల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, రిటైనర్ లాయర్ వంగూరి వెంకన్న, చౌగోని నాగరాజు, పారాలీగల్ వలంటీర్ వైద్యుల ఉపేందర్, పాల్వాయి వెంకటేశ్వర్లు, ఎంపీవో నాగలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నెల్లికంటి సత్యానికి పలువురు పరామర్శ

మునుగోడు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం మండలంలోని ఎలగలగూడెం గ్రామంలో రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి క్యామ మల్లేష్‌లు పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కలిసిన వారిలో యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నీల వెంకటేష్, దుడుకు లక్ష్మీనారాయణ, మిర్యాల యాదగిరి, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా నాయకులు బెల్లి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, తీర్పారి వెంకటేశ్వర్లు, నాయకులు సురిగి చలపతి, ఈదులకంటి కైలాష్, కట్కూరి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయులకు అండగా ఉంటా

- ***ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి***



నల్లగొండలోని గురుకుల డిగ్రీ కాలేజీ అధ్యాపకులను మద్దతు కోరుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గురుకుల ఉపాధ్యాయుల, అధ్యాపకులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, వారి హక్కులు, సంక్షేమం కోసం ముందుండి పోరాడుతానని నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ టీపీఆర్టీయూ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ప్రచారంలో భాగంగా ఆయన జిల్లాలోని చర్లపల్లి, నకిరేకల్, తిప్పర్తి, అనుముల, నల్లగొండమైనార్టీ గురుకులాల్లో మధ్యాహ్న భోజన సమయంలో సందర్శించి అక్కడి అధ్యాపకులు, ఉపాధ్యాయులను తనకు అండగా ఉండాలని, మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు 42 తెలంగాణ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య మద్దతు ప్రకటించిందని పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్ల మాదిరిగా 010 పద్దు ద్వారా, ప్రతీ నెలా 1వ తేదీన గురుకులాల ఉపాధ్యాయులకు వేతనాలు వచ్చేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. హెల్త్‌కార్డులు, వైద్య సదుపాయాల కోసం పోరాడుతామని, పాత పింఛన్ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హాస్టల్ వార్డెన్, డిప్యూటీ వార్డెన్ పోస్టుల నియామకాల కోసం, రెండో శనివారం ఇతర ఆప్షనల్ సెలవుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఆమోదింపజేస్తానని అన్నారు. గురుకులాలు, మోడల్‌స్కూళ్లల్లో పనిచేస్తున్న అధ్యాపకులందరికీ గెజిటెడ్ హోదా కోసం పోరాడుతామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపిస్తే ఉపాధ్యాయలోకానికి అందుబాటులో ఉండి సేవచేస్తానని హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో సంఘం నాయకులు ఉమాకర్‌రెడ్డి, బాలాజీనాయక్, ఓంప్రకాశ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించిన డీఎస్‌వో



గోపలాయపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలో కొనసాగుతున్న నూతన రేషన్ కార్డుల సర్వేను శనివారం డీఎస్వో వెంకటేశ్వర్లు పరిశీలించారు. గోపలాయపల్లిలో రేషన్‌కార్డుల మంజూరు కొరకు జాబితాలో ఉన్న వ్యక్తుల, రేషన్‌కార్డు అర్హతకు ఉన్న వివరాల నమోదును పరిశీలించారు. కాగా రేషన్‌కార్డుల జాబితాలో అర్హులైన కొందరి పేర్లు లేకపోవడంపై తమ పేర్లు ఎందుకు రాలేదని గ్రామస్థులు ప్రశ్నించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఉమేష్‌చారి, పంచాయతీ సెక్రటరీ ఉన్నారు.

సర్వేలో తప్పులు లేకుండా చూసుకోవాలి

నాంపల్లి: ప్రభుత్వం రైతులకు అందించే రైతు భరోసా కోసం జరిగే సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని తహసీల్దార్ దేవసింగ్ అన్నారు. మండలంలోని పగిడిపల్లి, మహ్మదాపురం గ్రామాల్లో సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయేతర భూమి, సాగుకు యోగ్యంకాని భూములను అధికారులు గుర్తించే సమయంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. చిన్న పొరపాట్లు జరిగినా ప్రభుత్వం అందించే సాయం అందకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● కట్టంగూరు: మండలంలోని కట్టంగూరు, దుగినెల్లి, రామచంద్రాపురం, కురుమర్తి గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములను సంబంధిత అధికారులు రైతుభరోసా సర్వే నిర్వహించారు. కట్టంగూరులో సాగుకు యోగ్యం కాని భూములు 30 ఎకరాలు, దుగినెల్లిలో 5 ఎకరాలు, రామచంద్రాపురంలో 11 ఎకరాలు, కురుమర్తిలో 53 ఎకరాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమం లో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఏవో గిరిప్రసాద్ పాల్గొన్నారు.

● రైతుభరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మర్రిగూడ తహసీల్దార్ బక్క శ్రీనివాస్ అధికారులకు సూచించారు. రైతుభరోసా సర్వేలో భాగంగా ఖుదాభక్ష్‌పల్లి, సరంపేట, కొట్టాల, కొండూర్, బట్లపల్లి గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. వారి వెంట సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్, ఏవో హేమలత, సిబ్బంది ఉన్నారు.

● కనగల్ మండలంలోని దర్వేశిపురం గ్రామంలో ఏవో అమరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే చేపట్టారు. సాగుకు యోగ్యం కాని భూములను క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

- ***ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు***
- ***10 లీటర్ల నాటుసారా స్వాధీనం, ఇద్దరు అరెస్ట్***

దేవరకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.కిషన్ అన్నారు. నల్లగొండ ఏఈఎస్ ఆధ్వర్యంలో శనివారం దేవరకొండ సీఐ శ్రీనివాస్, నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు మూకుమ్మడిగా సర్కిల్ పరిధిలోని ఎడ్లగడ్డతండా, డిండి, ప్రతాప్‌నగర్‌లలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. నాటుసారా విక్రయిస్తున్న మూడావత్ కళమ్మ, రమావత్ రాజమ్మను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా, 60 కేజీల బెల్లం, 10 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో 900లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు వీరబాబు, నర్సింహ, మల్లేష్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కేతేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుపాముల ఆవాస గ్రామమైన రాయపురంలో గత నెల 31వ తేదీన జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు నకిరేకల్ కోర్టులో శనివారం రిమాండ్‌కు చేశారు. కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో శాలిగౌరారం సీఐ కె.కొండల్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. రాయపురం గ్రామానికి చెందిన చిన్నాబత్తిని లూర్దుమేరి ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన లూర్దుమేరి ఇంటికి తాళం వేసి స్కూల్ విధులకు వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. బాధితురాలు లూర్దుమేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కేతేపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 8వ తేదీన ఏపీలోని బందరు తాలూకా పోలీసులు కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతంపల్లి గ్రామానికి చెందిన గంట రామారావు అలియాస్ లెల్ల రంగారావు అనే వ్యక్తిని ఓ కేసులో అదుపులోకి తీసుకున్నారు. సదరు కేసులో ఏపీ పోలీసులు రామారావును విచారిస్తున్న క్రమంలో రాయపురంలోని చోరీ సంఘటన వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో బందరు పోలీసుల నుంచి అందిన సమాచారం మేరకు శాలిగౌరారం సీఐ కె.కొండల్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు గంట రామారావును అదుపులోకి తీసుకుని విచారించగా రాయపురంలో చోరీకి పాల్పడింది తానేనని అంగీకరించాడు. చోరీలో అపహరించిన 113 గ్రాముల బంగారు వస్తువులను రికవరీ చేసి నిందితుడిని పీటీ వారెంట్‌పై అరెస్టు చేసి నకిరేకల్ కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు సీఐ కె.కొండల్‌రెడ్డి తెలిపారు. ప్రజలు ఇంటికి తాళం వేసి వెళ్లే క్రమంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా చూసుకోవడంతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. హైవే వెంట, గ్రామ శివారులో నివాసగృహాలు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

'శాలివాహనుల సమస్యలను పరిష్కరించాలి'

నార్కట్‌పల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శాలివాహనుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశంను కోరారు. నకిరేకల్ నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే వేముల వీరేశంనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాలివాహన సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రాధారపు భిక్షపతి, ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం, దశరథ, ఎలిజాల వెంకన్న, లింగయ్య, నిమ్మగోలి వెంకన్న, మిడిదొడ్డి రాజు, యాదగిరి, సైదులు, సత్యనారాయణ, గోపాలు, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్ర అధ్యక్షురాలిని కొనసాగించడంపై నిరసన

మర్రిగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంఘమిత్ర అధ్యక్షురాలిని తొలగించినప్పటికీనీ ఆమెను మార్చకుండా కొనసాగించడంపై మహిళా సంఘాల అధ్యక్షులు వెలుగు కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రతీ మూడు నెలలకొకసారి మహిళా సమాఖ్య సమావేశం నిర్వహిస్తారు. అయితే సంఘ బంధాల అధ్యక్షులు కలిసి అధ్యక్షురాలిని మారుస్తున్నట్లు 2024 జూన్‌లో డీఆర్‌డీఏ కార్యాలయానికి తీర్మానపత్రం పంపినట్లు తెలిపారు. ఇంత వరకు ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కొనసాగిస్తున్నారని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేశారు. పాత అధ్యక్షురాలిని కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెను తొలగించనంత వరకు మండల సమాఖ్య సమావేశం జరగనివ్వమని మహిళా సంఘ అధ్యక్షులైన శాంతి, సునీత, ఫర్జానా, యాదమ్మ, మల్లమ్మ, అండాల్ వెల్లడించారు. ఈ ఆరోపణలపై డీఆర్‌డీవో ఏపీడీవోలైన బెనర్జీ, శారదలను వివరణ కోరగా నూతన అధ్యక్షురాలిని నియమించవద్దని నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. బైలాకు వ్యతిరేకంగా సంఘమిత్ర అధ్యక్షురాలి ఎన్నిక జరిపారని ఈ తీర్మానం చెల్లదని వారు వెల్లడించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు ప్రస్తుతం సంఘమిత్ర అధ్యక్షురాలిగా గీత కొనసాగుతుందని తెలిపారు.

అర్హుల జాబితాపై అసంతృప్తి



- అందరినీ చేర్చలేదని అభ్యంతరాలు
- కులగణన ప్రాతిపదికన రేషన్‌కార్డుల జాబితా
- అర్హుల సంఖ్య కుదించారనే విమర్శలు
- గ్రామసభల్లో నిరసనలు ఎదురయ్యే అవకాశం
- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఎంపిక చేయాలనే సూచనలు
- మళ్లీ దరఖాస్తులు తీసుకోవాలని ప్రజల విన్నపం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రేషన్‌కార్డులు పొందేందుకు అర్హులైనవారి జాబితా దాదాపు 70శాతం మేర కుంచించుకుపోయిందని సమాచారం. పౌరసరఫరాలశాఖ రూపొందించిన జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 69,623 కుటుంబాలకు కొత్తగా రేషన్‌కార్డులు పొందేందుకు అర్హత ఉంది. పౌరసరఫరాలశాఖ రూపొందించిన జాబితా ప్రకారం రేషన్‌కార్డు పొందాలంటే వార్షిక కుటుంబ ఆదాయం గ్రామాల్లో అయితే రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.2లక్షల లోపు ఆదాయం ఉండాలి. అదేవిధంగా వ్యవసాయభూమి తరి అయితే మూడున్నర ఎకరాలు, మెట్ట అయితే ఏడున్నర ఎకరాల భూమికి లోబడి ఉండాలి. ఈ ప్రాథమిక అర్హతల ఆధారంగా అర్హులను ఎంపికచేస్తే ఎలాంటి ఇబ్బందిలేకుండా న్యాయం జరిగేదని, కానీ కులగణన వివరాల ఆధారంగా తీసుకోవడం ద్వారా అన్యాయం జరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కులగణనలో మోటర్‌సైకిళ్లు, కారు, పక్కాఇళ్లు, ఉద్యోగ స్థితిగతులు, ప్రైవేట్ ఉద్యోగాల వివరాలు, వేతనాల వివరాలు సేకరించారు. ఈ వివరాలు ఇవ్వడంతో భార్యాభర్తలు కూలీ చేసుకునే కుటుంబాల వారు కూడా మోటర్‌సైకిల్ కలిగి ఉన్నారని, ఏడాదికి ఇద్దరికి కలిపి రూ.3లక్షల పైచిలుకు సంపాదన ఉంటుందని, పెరిగిన జీవన వ్యయం, మారిన జీవన సరళి నేపథ్యంలో ఈ సంపాదన, ఖర్చు బీపీఎల్‌కు లోబడే ఉంటుందని, అయితే రేషన్‌కార్డుకు విధించిన కనీస ఆదాయ పరిమితే సరిగా లేదని వాపోతున్నారు. ప్రస్తుతం కూలీ పనిచేసుకునే కుటుంబాల వారికి సైతం మోటర్ సైకిల్ తప్పనిసరి అవసరంగా మారింది. అదేవిధంగా పక్కాఇళ్లు కట్టుకుంటున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రతీ గ్రామంలో ఉన్నాయి. ఆ సందర్భంలో అందరూ ఇళ్లు కట్టుకోగా, ఇప్పుడు వీటన్నింటినీ ఆదాయంగా పరిగణించి రేషన్‌కార్డుల జాబితా నుంచి తొలగించి ఉంటారని అర్హులు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల్లో తెల్లకాగితాలపై దాదాపుగా 2,97,000 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ విచారణ చేసి అర్హులను గుర్తించి జాబితా రూపొందిస్తే ఈ గందరగోళం, విమర్శలకు అవకాశం ఉండదని పలువురు కాంగ్రెస్ నాయకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం చేపట్టిన ప్రక్రియ గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి సర్వే (కులగణన) ప్రాతిపదికన కొత్త రేషన్ కార్డులు జారీచేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జాబితా రూపొందించి కలెక్టర్లకు పంపింది. ఈ జాబితాలోని కుటుంబాల పరిస్థితిని మరోసారి పరిశీలించిన పిదప ఈనెల 21 నుంచి నిర్వహించే గ్రామసభల్లో గ్రామాలు, మున్సిపల్‌వార్డుల వారీగా తుదిజాబితా రూపొందించి కలెక్టర్ల ద్వారా మళ్లీ పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు నివేదిస్తారు. అయితే తాజాగా విడుదల చేసిన జాబితా సమగ్రంగా లేదని, తమకు చోటు దక్కలేదని పలువురు అర్హులు వాపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన దరఖాస్తులు తీసుకోగా, వాటిని పరిశీలించి లబ్ధిదారులను ఎంపిచేయాల్సి ఉండగా, దాన్ని విస్మరించి కులగణన సర్వేను ప్రామాణికంగా తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. అర్హులైన వారిలో సగం మంది పేర్లు కూడా జాబితాలో లేకపోవడంపై అధికారపార్టీకి చెందిన నాయకులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- (నల్లగొండ, ఆంధ్రజ్యోతిప్రతినిధి)



ప్రజాపాలన దరఖాస్తుల ప్రాతిపదిక తీసుకోవాలి

రేషన్‌కార్డుల అర్హుల జాబితా రూపకల్పన హడావిడిగా జరిగిందని, అర్హులకు అన్యాయం జరిగిందనే విమర్శలు, సమాచారం నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించాలనే సూచనలు వస్తున్నాయి. గ్రామసభల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాతో కలిపి రేషన్‌కార్డుల లబ్ధిదారులను కూడా ఎంపికచేయడం సమంజసం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేషన్‌కార్డులను బియ్యం కోసమే కాకుండా ఒక గుర్తింపుకార్డుగా, ఆరోగ్యపరమైన సమస్యలొచ్చినప్పుడు ఆసుపత్రుల్లో రిఫరెన్స్‌గా, ఒక రకంగా ఆధార్‌కు సమాంతరంగా దీన్ని ఉపయోగిస్తున్న నేపథ్యంలో ఈ కార్డులకు అర్హులను ఎంపికచేసేందుకు ప్రత్యేకంగా కార్యక్రమం చేపట్టాలని కోరుతున్నారు. ప్రజాపాలనలో తెల్లకాగితాలపై స్వీకరించిన దరఖాస్తుల నుంచి విచారణ జరిపి, అర్హులను గుర్తించి రేషన్‌కార్డులు జారీచేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండేది...

- మిగతా 6వ పేజీలో...

జిల్లా	రేషన్‌కార్డులకు అర్హులు	ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు	ప్రస్తుత రేషన్‌కార్డులు
నల్లగొండ	27,573	1,13,000	4,65,996
సూర్యాపేట	25,376	1,06,000	3,24,163
యాదాద్రి	16,674	78,000	2,16,831
మొత్తం	69,623	2,97,000	10,06,990

21న నల్లగొండలో రైతు మహాధర్నా

- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఉమ్మడి జిల్లా నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- మూడు జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షుల పిలుపు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు రవీంద్రకుమార్, బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 21వ తేదీన నల్లగొండలోని గడియారం సెంటర్‌లో రైతు మహాధర్నాను నిర్వహిస్తున్నట్టు నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, గాదరి కిషోర్, నోముల భగత్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాధర్నాకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి రానున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ పేరుతో మోసం చేసిందని, రైతుభరోసా రూ.15వేలకు హామీ ఇచ్చి రూ.12వేలకు తగ్గించిందన్నారు. వ్యవసాయరంగంతో పాటు గృహాలకు విద్యుత్ కోతలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. త్రీఫేస్ విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడో పోతుందో తెలియడం లేదని, యాసంగికి యూరియా కొరత మొదలైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులను రాజును చేయాలని చూస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందన్నారు. బీఆర్ఎస్‌కు అధికారం ముఖ్యం కాదని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము ముందుకు పోతామన్నారు. రేవంత్ సర్కారు రైతులను మోసం చేసిందని 420 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై దాడులు చేసేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, నిరంజన్ వలీ, కటికం సత్తయ్యగౌడ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివా‌స్‌రెడ్డి, తండు సైదులు గౌడ్, కొండూరు సత్యనారాయణ, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, జమాల్ ఖాద్రీ, ఫైనం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అయిటిపాముల ఎత్తిపోతలను పూర్తి చేస్తాం

- 8వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



అయిటిపాముల ఎత్తిపోతల వద్ద మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని ఎనిమిది నెలల్లో పూర్తి చేసి 8వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని అధికారులు, స్థానిక రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహకారంతో అయిటిపాముల ఎత్తిపోతల పథకం మంజూరైందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో నిమ్మతోటలను బతికించేందుకు రైతులు ట్రాక్టర్లతో నీటిని తెచ్చేవారని, ఇకపై ఆ కష్టాలు ఉండవన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి కాగానే నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎత్తిపోతలను ప్రారంభింపజేయిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది సుక్కయ్య, మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, నంద్యాల వెంకట్‌రెడ్డి, వల్లపు శ్రీనివా‌స్‌రెడ్డి, బుచ్చాల వెంకన్న, సోమగాని రామకృష్ణ, బండారు కృష్ణ, ఎడ్ల పెద్ద రాములు, బూరుగు శ్రీను, దార భిక్షం, రెడ్డిపల్లి స్వామి, అనంతుల సైదులు, మిట్టపల్లి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కొనసాగిన రద్దీ

తిరుగుప్రయాణమైన ఏపీ వాసులు



పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

కేతేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ 65వ నెంబ రు జాతీయ రహదారిపై శనివారం తిరుగు ప్రయాణ వాహనాల రద్దీ కొనసాగింది. సంక్రాంతి పండగకు ఏపీతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు పూర్తిస్థాయిలో హైదరాబాద్‌కు చేరలేదు. పండుగ తరువాత బుధ, గురువారాల్లో కొందరు హైదరాబాద్ చేరగా, మిగిలిన వారు వీకెండ్ వరకు సొంతూళ్లలోనే గడిపారు. ఈ క్రమంలో పలువురు శనివారం హైదరాబాద్ బాటపట్టారు. దీంతో శనివారం ఉదయం నుంచి రద్దీగా ఉన్న 65వ నెంబరు జాతీయ రహదారిపై సాయంత్రానికి వాహనాల జోరు మరింత పెరిగింది. హైవేపై ఇదే రద్దీ ఆదివారం వరకు కొనసాగే అవకాశం ఉంది.

కొనసాగుతున్న ముస్లింల ఆధ్యాత్మిక సదస్సు



జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులో ఆధ్మాత్మిక సదస్సు అనంతరం బసచేసిన ముస్లింలు

నల్లగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డు ఈద్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ముస్లింల ఆధ్యాత్మిక సదస్సు శనివారం కొనసాగింది. పలువురు మత గురువులు, ఉల్మాలు, మౌలానాలు ఈ సదస్సుల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది సైతం నల్లగొండలో సదస్సు నిర్వహిస్తున్నామని, గత 50 ఏళ్లుగా ఈ సదస్సు కొనసాగుతోందన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ముస్లింలు సోదర భావంతో ఉండి దేవుడి బోధనలను అచరించాలన్నారు. మహమ్మద్ ప్రవక్త చెప్పిన బోధనలు, ఖురాన్‌లోని అంశాలను ప్రతీ ముస్లిం తప్పక పాటించాలని సూచించారు. దైవ భక్తి ఉన్నప్పుడే జీవితాలు సుఖమయంగా ఉంటాయని, ప్రవక్త బోధనలను అనుసరించి ఇతరులతో ప్రేమగా మెలగాలని, కరుణ, దయ, శాంతి, పరోపకారం, నిస్వార్థసేవా వంటి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. తప్పని సరిగా రోజుకు ఐదు సార్లు నమాజ్ చేయాలని, దివ్య గ్రంథమైన ఖురాన్‌ను తప్పక చదవాలని సూచించారు. యువకులు సన్మార్గంలో నడవాలని ప్రవచించారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు సదస్సు కొనసాగింది. ఐదు సార్లు నమాజ్ అనంతరం మత గురువులు, ఉల్మాలు, మౌలానాలు దైవ ప్రసంగం చేశారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు పలు ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సు ఆవరణలో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో మత పెద్దలు మౌలానా ఫారూక్, ముఫ్తీ అహ్మద్, ఖాద్రీ సైపుల్లా, మౌలానా హారూన్, భాయి సాలిక్, ముఫ్తీ అమ్జద్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఎంవీఐ లావణ్య
- హెల్మెట్ ధరించని వాహనదారులకు చాక్లెట్ ఇచ్చి అవగాహన



ట్రాఫిక్ పీఎస్ ఆధ్వర్యంలో గడియారం సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం,జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, అందుకోసం విధిగా వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) లావణ్య సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నల్లగొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ దూది రాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు క్లాక్ టవర్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాహనదారులు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అత్యధికంగా మద్యం తాగి వాహనాలు నడపడంతో జరిగిన ప్రమాదాల్లో ఎక్కువ మంది మృతి చెందుతున్నారని, అంతేగాక క్షతగాత్రులవుతున్నారని అన్నారు. ప్రతీ వాహనదారుడి కోసం వారి కుటుంబం ఎదురు చూస్తుందనే విషయాన్ని గుర్తుంచుకొని జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం హెల్మెట్ లేకుండా వాహనాలు నడుతున్న వాహనదారులకు ట్రాఫిక్ సీఐ దూది రాజు చాక్లెట్లు ఇచ్చి హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

సర్వేను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



తిప్పర్తిలో ఇటుకబట్టీల స్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిప్పర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వేలను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సర్వేను ఆయన తనిఖీ చేశారు. రైతు భరోసా కోసం నిర్వహిస్తున్న సర్వేలో ఎంత మేర వ్యవసాయేతర భూములు ఉన్నాయి? ఎంత మేర సాగులో ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పలు గ్రామాల్లో ఏళ్లుగా సాగు భూమిగా ఆన్‌లైన్‌లో చూపుతోందని, కానీ అక్కడ నివాసాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయని అధికారులు ఆయనకు వివరించారు. అలాంటి స్థలాలను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ డి.స్వప్న, ఏవో సన్నిరాజు, ఏఈవో సంతోషిని, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ

- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన ప్రజలు
- పలువురు నేతల హౌస్ అరెస్ట్

• 6లో..



అంబుజా సిమెంట్స్ గనుల విస్తరణపై దామరచర్ల మండలంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

భూసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



భూసర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

శాలిగౌరారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం అమలుకు వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు సర్వేను త్వరితగతిన చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వల్లాల గ్రామంలో భూముల గుర్తింపు సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు, నిర్ధారణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్రమ లేఅవుట్‌లు, ఇళ్లులేదా ఇళ్ల స్థలాలు,రోడ్లు,పరిశ్రమలు, గోదాములు, మైనింగ్, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు వ్యవసాయ యోగ్యం కానివిగా చూపించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సౌమ్య శృతి, ఏఈవో శ్రవణ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకన్నపాల్గొన్నారు.

యుగపురుషుడు తారక రాముడు

● ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలి ● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ● అంతటా నందమూరి తారక రామారావు వర్ధంతి ● వృద్ధులు, రోగులకు పండ్లు పంపిణీ చేసిన నాయకులు


మిర్యాలగూడలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


దామరచర్లలో..


దేవరకొండలో..


అడవిదేవులపల్లిలో..

మిర్యాలగూడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు యుగపురుషుడని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా సాగర్‌రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నట విశ్వరూపంతో సినిమా రంగంలో అశేష అభిమానుల మెప్పు పొందిన నందమూరి తారక రామారావు రాజకీయ రంగంలో అడుగిడిన తొమ్మిది నెలల్లోనే ప్రజాభిమానంతో ప్రకంపనలు సృష్టించి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారన్నారు. బడుగు, బలహీనవర్గాల వారి సంక్షేమానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, చలపతిరావు, పాతూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కళావేదిక నిర్వాహకులు ఎమ్మెల్యేను కలిసి ఆదివారం జరిగే సినీ స్వరాభిషేకం కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో కళావేదిక నిర్వాహకులు శ్రీనివాసాచారి, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పథకాలు పేదలకు అన్నం పెట్టాయి : శ్రీనివాస్

స్వర్గీయ రామారావు నాడు ప్రవేశ పెట్టిన పథకాలే పేదల కడుపు నింపాయని టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, సాగర్‌రోడ్డులోని విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2కే కిలో బియ్యం పథకంతో పేదల కడుపులు నింపారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీనేత నసీరొద్దీన్ బాబా, మండల కన్వీనర్ చిలకల వెంకన్న, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు గోపాలకృష్ణ, తెలుగురైతు రాష్ట్ర నేత బొంగరాల మట్టయ్య, నాయకులు అనంతరాములు, నూకపంగు కాశయ్య, దాసరాజు జయరాజు, చవల వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, మచ్చ సైదులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఎన్టీఆర్ వర్ధంతి

మిర్యాలగూడ టౌన్: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రముఖులు నివాళులర్పించారు. పార్టీలకతీతంగా నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాదినేని శ్రీనివాసరావు తదితరులు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. కమ్మవారి సంఘం అధ్యక్షుడు ముప్వ అరుణ్‌కుమార్, ముక్కపాటి వెంకటేశ్వరరావు, గాయం ఉపేందర్‌రెడ్డి, తిరందాసు విష్ణు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో తిరందాసు విష్ణు, వెంకటేశ్వర్లు, నందమూరి అభిమానులు, విద్యార్థి, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిడమనూరు: స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను నిడమనూరులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్వా అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంద తిరుపతయ్య, కట్టా నర్సింహారావు, చేకూరి సుధాకర్, ఉన్నం విజయభాస్కర్, పేలప్రోలు ప్రణయ్ చౌదరి, గల్లా చంద్రశేఖర్, ఉన్నం కృష్ణయ్య, మేకల సత్తిబాబు పాల్గొన్నారు.

దామరచర్ల: మండల కేంద్రంలో పలువురు టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాన్యనాయక్, నాగుల్‌మీరా, జాని, మల్లికార్జున్, సైదులు, సుబ్బారావు, సైదానాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వస్కుల కృష్ణయ్య అన్నారు. దేవరకొండలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో దేవరకొండ మండల టీడీపీ అధ్యక్షుడు గార్లపాటి శ్రీనివాస్, చందంపేట అధ్యక్షుడు చిలుకూరి బ్రహ్మాచారి, సీతరాములు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు దొడ్డి శ్రీను, వస్కుల రాజేష్, జర్పుల జగన్ పాల్గొన్నారు.

వేములపల్లి: పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహా నాయకుడు ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్రనేత జడ రాములుయాదవ్ అన్నారు. కార్యక్రమంలో దైద నాగరాజు, జడ మల్లేష్‌యాదవ్, కట్టెబోయిన శంకర్, అర్వపల్లి నాగయ్య, కోటయ్య, నర్సింహ, మల్లయ్య పాల్గొన్నారు.

పెద్దవూర: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికై పాటుపడిన ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని టీడీపీ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనుయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బండారు నారాయణ, కొట్టె శ్రీను, సక్రునాయక్, వెంకటయ్య, ఆంజనేయులు, రామ్‌చరణ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఎన్టీఆర్ వర్ధంతిని మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో టీడీపీ సీనియర్‌నేత ఉప్పల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, సిద్ధగోని నరసింహ, ఎద్దుల బాలయ్య, సాలయ్య, దోటి సంతోష్, పెద్ది రాములు, యాదగిరి చారి పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

నాంపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. శనివారం మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని, విద్య, వైద్యరంగాలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మహాసభలు 25 నుంచి 28వరకు సంగారెడ్డి జిల్లాకేంద్రంలో జరుగుతున్నందున కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, లక్ష్మయ్య, వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, యాదగిరి, సైదులు, గోపాల్, లక్ష్మయ్య, సురేష్ పాల్గొన్నారు.

వేములపల్లి: ఈ నెల 25న సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లానేత రొండి శ్రీనివాస్ కోరారు. శనివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై రాష్ట్రంలో ప్రజల పక్షాన ఎన్నో పోరాటాలు చేస్తున్న ఘన చరిత్రగల పార్టీ సీపీఎం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్వాయి రాంరెడ్డి, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, వెంకటేశం, లింగయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి : ఆర్డీవో


సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న పథకాలకు అర్హుల ఎంపిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు, దుగ్యాల, అక్కంపల్లి గ్రామాల్లో జరుగుతున్న రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించి మాట్లాడారు. సర్వేలో తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఆర్డీవో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి పరిస్థితులను సమీక్షించారు. సర్వే బృందాలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీడీవో చంద్రమౌళి, స్పెషల్ ఆఫీసర్ నాగమల్లేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలి: తహసీల్దార్

నాంపల్లి: ప్రభుత్వం రైతులకు అందించే రైతు భరోసాకోసం జరిగే సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని నాంపల్లి తహసీల్దార్ దేవసింగ్ అన్నారు. శనివారం మండలంలోని పగిడిపల్లి, మహ్మదాపురం గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, వ్యవసాయేతర భూమి, సాగుకు యోగ్యంకాని భూములను అధికారులు గుర్తించే సమయంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పడమటితండాలో విచారణ


విచారణ జరుపుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

డిండి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కళ్యాణలక్ష్మీ చెక్కుల జారీలో జరిగిన జాప్యంపై తహసీల్దార్ అంబటి ఆంజనేయులు శనివారం పడమటితండాలో విచారణ జరిపారు. రాత్లావత్ పాండు కుటుంబంతోపాటు గ్రామస్థులను తహసీల్దార్ విచారించారు. పాండునాయక్ కుమార్తె అఖిల వివాహం 2021, డిసెంబరు 10న జరిగింది వాస్తవమేనని గ్రామస్థులు తహసీల్దార్‌కు తెలిపారు. కళ్యాణలక్ష్మీ కోసం పాండునాయక్ చేసుకున్న దరఖాస్తు సరిగా ఉన్నా చెక్కు జారీ చేసేందుకు ఆర్ఐ శ్యాంనాయక్ రూ.10వేలు డిమాండ్ చేయడంతో అఖిల తండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆర్ఐ నివాసంలో ఈ నెల 17న ఏసీబీ అధికారులు పాండునాయక్ నుంచి రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు తహసీల్దార్ తండాకు చేరుకొని పూర్తిస్థాయిలో విచారణ జరిపారు. విచారణలో లబ్ధిదారుడు బ్యాంక్ ఖాతా తీయడంలో ఆలస్యమైందని తెలిపారు. పూర్తి విచారణ మేరకు దరఖాస్తు సరిగా ఉన్నందున పాండునాయక్ కుటుంబానికి కళ్యాణలక్ష్మీ చెక్కు త్వరలో అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

కొనసాగుతున్న సాగుకు నోచని భూముల సర్వే

● క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

నిడమనూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగుకు యోగ్యం కాని వ్యవసాయ భూముల సర్వే కొనసాగుతుంది. శనివారం తుమ్మడం, మారుపాక, శాఖాపురం, వెనిగండ్ల గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. గ్రామస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులు భూములను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో భూముల సర్వే చేపడుతున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం రైతులు, సర్వే నెంబర్లు, బై నెంబర్ల వివరాల ఆధారంగా అధికారులు సర్వే చేస్తున్నారు. వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న స్థలాల్లో పంటలు సాగు చేస్తున్నారా, ఏమైనా వెంచర్లు ఏర్పాటు చేశారా? లేదా? అనేది సేకరిస్తున్నారు. మరో రెండు రోజులపాటు గ్రామాల్లో ఈ సర్వే కొనసాగనుంది. ఈ నెల 21 నుంచి 24 వరకు నాలుగు రోజులపాటు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. పంటలు సాగు చేసిన వ్యవసాయ భూములకు మాత్రమే రైతుభరోసా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ సర్వే చేస్తున్నారు. కాగా ఈ నెల 26 నుంచి రైతు భరోసా అమలు చేయనున్నారు. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట పంటలు సాగు చేసిన రైతులకు పెట్టుబడులకోసం రైతుల ఖాతాలో ఎకరానికి ఏడాదికి రూ.10 వేలు జమ చేయగా ఈ ప్రభుత్వం ఏడాదికి రూ.12వేలు ఇవ్వనుంది. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఏవో మునికృష్ణయ్య, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, భూక్యా శ్రీను, సందీప్, రాములమ్మ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు

అడవిదేవులపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ శ్యామ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ముదిమాణిక్యం గ్రామశివారులో సర్వే నెం.1లోగల ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాలమేరకు ఆ ప్రదేశానికి వెళ్లి అక్రమ మట్టి తరలింపును అడ్డుకున్నామన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించినా, అక్రమ మట్టి తరలింపునకు పాల్పడినా, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోసారి ఇలాంటి చర్యలు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ఆయనవెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దేవరకొండ ఖిల్లా అభివృద్ధికి కృషి

● ఖిల్లాలో రూ.5 కోట్లతో నిర్మించిన పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే బాలునాయక్


దేవరకొండ ఖిల్లాలో పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ ఖిల్లాలో రూ.5కోట్లతో ఐదు ఎకరాల్లో నిర్మించిన పార్కును ప్రారంభించి మాట్లాడారు. పార్కు నిర్మాణంతో దేవరకొండ ఖిల్లాకు పర్యాటక శోభ వచ్చిందన్నారు. దేవరకొండ ఖిల్లాతోపాటు దేవరచర్ల, గాజుబేడం గుహలకు 750 సంవత్సరాలకుపైగా చరిత్ర ఉందని, ఇటీవల శాసనసభలో ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ కమీషనర్ సుదర్శన్, కౌన్సిలర్ పున్నబోయిన భూదేవి సైదులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రహత్‌అలీ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, గాజుల మురళి, శ్రీశైలం యాదవ్, నజీర్ అహ్మద్, జయప్రకాష్‌తోపాటు కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో రాణించాలి

చింతపల్లి: మహిళలందరూ కుట్లు, అల్లికలపై ఆసక్తి పెంచుకొని స్వయం ఉపాధితో రాణించాలని బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో మహిళలకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన వారికి ఎమ్మెల్యే ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేట్ ఎండి.సిరాజ్‌ఖాన్, మాజీ సర్పంచి ముచ్చర్ల యాదగిరి, లింగంపల్లి వెంకటయ్య, జహంగీర్, రియాజ్‌పాష, సలీం పాల్గొన్నారు.

నేరేడుగొమ్ము: ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. నేరేడుగొమ్ములోని పంచాయతీ పరిధిలోని పార్టీ శ్రేణులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశా, నిర్దేశం చేశారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్‌కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ ముక్కమళ్ల వెంకటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణ, పాపనాయక్ ఉన్నారు.

మహాధర్నాకు తరలిరావాలి: భగత్

గుర్రంపోడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రుణమాఫీ, రైతు భరోసా పేరిట మోసం చేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 21న నల్లగొండలో నిర్వహించే రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పిలుపునిచ్చారు. గుర్రంపోడులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రైతుల పక్షాన ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని తెలిపారు.

వీవోఏల మండల నూతన కమిటీ

తిరుమలగిరి(సాగర్), జనవరి 18(ఆంధ్రజ్యోతి): వీవోఏల మండల నూతన కమిటీని శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ సబ్‌యార్డులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలిగా ఉయ్యాల రజిత, ఉపాధ్యక్షులుగా అంగోతు రూప్లానాయక్, ప్రధాన కార్యదర్శిగా జటావత్ నాగేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శిగా వంగూరి జ్యోతి, కోశాధికారిగా రమావత్ కరుణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

దేవరకొండ, కొండమల్లేపల్లి, పెద్దవూర జనవరి 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల సెంటర్లలో శనివారం నవోదయ విద్యా సంస్థలలో 6వ తరగతి ప్రవేశానికి అర్హత పరీక్షలు నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాలసెంటర్‌లో 192 మంది విద్యార్థులకుగాను 154 మంది విద్యార్థులు హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాల సెంటర్‌లో 158 మంది విద్యార్థులకుగాను 98 మంది విద్యార్థులు హాజరైనట్లు దేవరకొండ ఎంఈవో మాతృనాయక్ తెలిపారు. కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 75 మంది విద్యార్థులకు 60 మంది హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్ ఆర్.నాగేశ్వర్‌రావు తెలిపారు. అదే విధంగా పెద్దవూర మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకుగాను శనివారం నల్లగొండలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. మొత్తం 13 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలో 13 మంది సూపరింటెండెంట్లు, జేఎన్‌వీకి సంబంధించిన సెంటర్ లెవల్ అబ్జర్వర్లు, ఆరు రూట్లకు ఆఫీసర్లను నియమించామన్నారు.

గురుకులాల సమస్యల పరిష్కారం యూటీఎఫ్‌తోనే సాధ్యం : నర్సిరెడ్డి


నర్సిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకులాల సమస్యల పరిష్కారం యూటీఎఫ్‌తోనే సాధ్యమవుతుందని యూటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డి అన్నారు. శనివారం ఆయన సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బందికి 010ద్వారా వేతనాలు అందేలా చూస్తానన్నారు. అలాగే హాస్టళ్లకు ప్రత్యేకంగా వార్డెన్లను, కేర్ టేకర్లను నియమించడానికి ప్రయత్నం చేస్తానన్నారు. గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న గెస్ట్‌టీచర్లకు కనీస వేతనం అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

దేవరకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.కిషన్ అన్నారు. శనివారం దేవరకొండ సీఐ శ్రీనివాస్, నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు సర్కిల్ పరిధిలోని ఎడ్లగడ్డతండా, డిండి, ప్రతాప్‌నగర్‌లలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. నాటుసారా విక్రయాలు జరుపుతున్న మూడావత్ కలమ్మ, రమావత్ రాజమ్మలను అరెస్ట్‌చేశారు. దాడుల్లో ఎస్ఐలు వీరబాబు, నర్సింహ, మల్లేష్, నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

కొండమల్లేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపరిధిలో ద్విచక్ర వాహనం, కోళ్లతో వస్తున్న వాహనం ఎదెరెదురుగా ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలయ్యాయి. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. దేవరకొండ పట్టణంలోని జంగాలకాలనీకి చెందిన బన్నీ తన స్నేహితుడు రాజేషను పీఏపల్లి మండలం మునావత్‌తండాలో దించి రావడంకోసం దేవరకొండ నుంచి బైక్‌పై బయల్దేరారు. మార్గంమధ్యలో కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామసమీపంలో హోటల్ వద్ద నాగార్జునసాగర్ నుంచి వస్తున్న కోళ్ల వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న బన్నికి తీవ్ర గాయాలై కాలు నుజ్జునుజ్జు అయ్యింది. బన్నిని మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ కు తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

సంక్షిప్త సమాచారం



గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

చింతపల్లి: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్ అన్నారు. శనివారం చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల గ్రామంలో సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, మద్దెల కృష్ణ, అంగిరేకుల శ్రీకాంత్, విరమళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిప్యూటేషన్లపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి: పలు ప్రభుత్వ పాఠశాలల్లో అక్రమ డిప్యూటేషన్లపై చర్యలు తీసుకోవాలని ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి చల్లం పాండురంగారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు... కొంతమంది మహిళా అధ్యాపకులు అక్రమ డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నప్పటికీ జిల్లా శాఖ స్పందించకపోవడం బాధకరమన్నారు.

దేవాదాయ శాఖ అధికారులకు వినతి

దామరచర్ల: మండలంలోని వీర్లపాలెం గ్రామశివారులోని రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానానికి సంబంధించిన భూములపై సమగ్ర వివరాలు తెలపాలంటూ శనివారం దేవాదాయశాఖ అధికారులకు పలువురు స్థానికులు వినతిపత్రం అందజేశారు. స్వామివారి దేవస్థానం దేవాదాయ, ధర్మాదాయ చట్టం ప్రకారం రిజిస్టర్ జరిగిందా? లేదా? అనే విషయంతోపాటు స్వామివారికి ధూప, దీప నైవేద్యం కోసం ఎంతమేర భూమి ఉందని, ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉంది అనే అంశాలతోపాటు ఆలయానికి సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరుతూ దేవాదాయశాఖ అధికారులకు వినతిపత్రం అందచేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

ముగిసిన మండల స్థాయి క్రికెట్ పోటీలు

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా యాదవ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. విన్నర్‌గా అంగడిపేటతండా రూ.20,116 గోవింద్ అందజేయగా, రన్నర్‌గా అంగడిపేట యాదవ్ యూత్‌కు రూ.15,116 కర్నాటి పాపిరెడ్డి అంజేశారు. మూడవ బహుమతి మేడారంనకు రూ.12,116 వంగాల ప్రతాప్‌రెడ్డి అందజేశారు.

నైట్‌వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంపోడు: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నైట్‌వాచ్‌మెన్ పోస్టుకు అర్హతగల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి నోముల యాదగిరి ఒక ప్రకటనలో కోరారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు, పదోతరగతి ఉత్తీర్ణత, స్థానికులై, సెక్యూరిటీలో అనుభవంగల మహిళా అభ్యర్థులు ఈ నెల 21లోగా మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుర్రంపోడు: మండలంలోని నడికూడ, గుర్రంపోడు, తేనపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలల్లో లయన్స్‌క్లబ్ గెలాక్సీ నల్లగొండ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి కోటిరెడ్డి, మారెడ్డి వెంకట్‌రెడ్డి, మనోహర్‌రావు, బుర్రి నాగిరెడ్డి, హెచ్‌ఎంలు సంధ్యారాణి, క్షేత్రయ్య, సునీత, శ్రీరంజన్, జయరాజ్, శోభారాణి తదితరులు ఉన్నారు.

కొత్తరేషన్‌కార్డుల కోసం ఆందోళన చెందొద్దు

గుర్రంపోడు: కొత్త రేషన్‌కార్డులకోసం ఎవరూ ఆందోళన చెందవద్దని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్త నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొంతమందికి కొత్త రేషన్‌కార్డులు వచ్చాయని, ప్రభుత్వం జాబితా విడుదల చేసిందని జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

మాడ్గులపల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్‌కార్డులు జారీ చేయకపోవడంతో అనేకమంది పేద ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకర్, అశోక్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగిరెడ్డి, నాగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

వేములపల్లి: మండలంలో అర్హత కలిగి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి కొత్త రేషన్‌కార్డులను అందించాలని బీఆర్ఎస్ జిల్లానేత కట్టా మల్లేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మొల్కపట్నం గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్వహించిన ప్రజాపాలనలో మండలంలో సుమారు 3వేల మంది కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోగా అధికారులు మాత్రం కేవలం మండలంలో 200మంది మాత్రమే అర్హులున్నారని జాబితా రూపొందించి సర్వే చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అందరి పేర్లు బహిరంగంగా గ్రామపంచాయతీల్లో ప్రదర్శించాలన్నారు. పేదలందరికీ రేషన్‌కార్డు ఇవ్వకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఆరోగ్య శ్రీ, కళ్యాణలక్ష్మీ, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల్లో కోత పెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంట్రగడ్డ గోపాల్‌రావు, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, గౌరు శ్రీనివాస్, పెదపంగ సైదులు, శ్రీధర్, నాగరాజు, సైదిరెడ్డి, జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

హాలియా: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్ అన్నారు. హాలియాలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన వీహెచ్‌పీఎస్ హాలియా మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి చైతన్యరెడ్డి, నాశనబోయిన వెంకటేశ్వర్లు, జంగాల బ్రహ్మం, పిల్లి బాలకృష్ణ, కొండల్, కొప్పుల రాజు, రామేశ్వరి, రమావత్ వాలి, కొండల్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామి విధంగా దివ్యాంగులకు రూ.4వేల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని, దివ్యాంగులకు 2016చట్టాన్ని అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మొదటి ప్రాధాన్యం దివ్యాంగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా ఎస్‌కె.సిద్దవాలి, ఉపాధ్యక్షుడిగా సంద్రాల లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా మామిడి నాగయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జంగాల బ్రహ్మం, ఇరిగి రామయ్య, వెంకటేశ్వర్లు, రాములు, కోమల వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.